ప్రజాశక్తి

సోమవారం 22 మే 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

పులి సంచారంతో కలకలం

- భయాందోళనలో ప్రజలు
- రంగంలోకి దిగిన ఫారెస్టు అధికారులు



పులి పాదముద్రలు

ప్రజాశక్తి-అర్ధవీడు

పెద్దపులి సంచారం కలకలం రేపింది. ఓ పెద్దపులి తాగునీటి కోసం నల్లకొండ దిగి నాగులవరం పూర్వ రహదారి దాటుకుని కంభం చెరువువైపు రావడాన్ని కొందరు గుర్తించి భయాందోళనకు గురయ్యారు. పెద్దపులి దాహం తీర్చుకుని వెలిగొండ ప్రాజెక్ట్ తూర్పు ప్రధాన కాలువ మీదుగా నల్లకొండ ఎక్కివెళ్లిన ఆనవాళ్లను గుర్తించారు. గ్రామ స్తుల సమాచారంతో అటవీశాఖ అధికారులు పులి పాదముద్రలు సేకరిం చారు. ఎవరూ భయాందోళన చెందాల్సిన పనిలేదని పెద్దపులి నుంచి ప్రజలకు భద్రత కల్పిస్తామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

నేడు బాపట్లకు గవర్నర్ అబ్దుల్‌నజీర్ రాక



ప్రజాశక్తి-బాపట్ల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నరు అబ్దుల్ నజీర్ సోమవారం బాపట్ల రానున్నారు. బాపట్ల వ్యవసాయ కళా శాలలో నిర్వహిస్తున్న స్నాత కోత్సవంలో పాల్గొ నేందుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ఇక్కడి వస్తున్నారు. ఉదయం 9.30 గంటలకు విజయవాడ రాజ్‌భవన్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 11 గంటలకు బాపట్ల వ్యవసాయ కళాశాలకు చేరు కుంటారు. 11.30 గంటల నుంచి 12.55 గంటల వరకు కళాశాలలో జరిగే ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ 55వ స్నాతకోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసే ఆతిథ్యాన్ని స్వీకరిస్తారు. మధ్నాహ్న 2.30 నిమిషాలకు బయలుదేరి 4 గంటలకు విజయవాడలోని రాజ్‌భవన్‌కు చేరుకుంటారు.

కబ్జా చేస్తాం.. అమ్మేస్తాం..

- ఆక్రమణదారుల బరి తెగింపు
- పేదల జాగాలు, వాగు పోరంబోకు భూమిపై కన్ను
- చోద్యం చూస్తున్న అధికారులు



వాగు పోరంబోకు భూమిలో చేపట్టిన నిర్మాణం

ప్రజాశక్తి-కనిగిరి

ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జాచేస్తాం.. ఆపై దర్జాగా అమ్మేస్తాం.. తమను ఎవరు ఏమి చేయలేరు అన్న రీతిలో కొనసాగుతోంది ఆక్రమార్కుల తీరు. పేదల జాగా,వాగు పోరంబోకు భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఈ తంతు జరుగుతుంది ఎక్కడో కాదు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని కనిగిరి-ఒంగోలు మార్గంలోని సూరాపాపి రెడ్డినగర్ మరియు పరిసరప్రాంతాలో...

పేదల జాగాపై కన్ను...

ఆరు సంవత్సరాల పాటు ప్రజాసంఘాల ఐక్యవేదిక 47 పోరాటాలు, నిరాహార దీక్షలు నిర్వహించిన ఫలితంగా 2012లో కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని కనిగిరి-ఒంగోలు మార్గంలో సర్వేనెం 895, 900/1లోని 6 ఎకరాల్లో 215 మంది పేదలకు అధికారులు పట్టాలు పంపిణీ చేశారు. దానికి సూరాపాపిరెడ్డినగర్‌గా పేరు పెట్టారు. పేదల జాబితాలో లబ్ధిదారులైన బలసాని పోలయ్య, బెంజిమెన్ కన్ను పేదల జాగాపై కన్నేసి వారియొక్క అవసరాలను,బలహీనతలను అవకాశంగా తీసుకుని దళారులఅవతారమెత్తి కొంతమంది స్థలాలను అప్పటినుంచి ఇప్పటి వరకు విక్రయాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు.

వాగు పోరంబోకు భూమి ఆక్రమణ...

సూరాపాపిరెడ్డి నగర్‌లోని పేదల జాగాలకు విక్రయాలు జరుపుతూ నాలుగు కాసులు వెనకేసుకుంటున్న పోలయ్య,బెంజిమెన్ ప్రక్కనే ఉన్న సర్వేనెం 894లోని 8.50సెంట్లు వాగు పోరంబోకు భూమిపై కన్నేసి ఆక్రమించి విక్రయిస్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా నిబంధనలకు తిలోధకాలు వదిలి రియల్ వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. వారి దురాక్రమణలను గమనించిన ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు ఈచర్యలు మానుకోవాలని సర్ధిచెప్పే ప్రయత్నం చేసినప్పటికి వారిలో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో విషయాన్ని అధికారుల దృష్టికి పలు మార్లు తీసుకుపోయారు.

రెచ్చిపోతున్న ఆక్రమణదారులు

సమస్యను అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకుపోయినప్పటికి వారు ఎలాంటి చర్యలు చేపట్టక పోవటంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి అమ్ముకుంటూ తమ జేబులు నింపుకుంటున్నారు. పేదలకు అసైన్‌మెంట్, వాగు పోరంబోకు భూములను అంటగడుతూ మోసం చేస్తున్నారు. ఆక్రమించిన భూమిలో అక్రమంగా నిర్మాణాలను చేపడుతుండటంతో ఆగ్రహించిన ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు శనివారం మరోసారి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.అయితే రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చే అధకారం తమకు లేదని, మున్సిపాలిటీ అధికారులకు ఉందని ▶ 2లో

బోగస్ గ్రూపులతో రుణాలు

- పేరుకుపోయిన కోట్లాది రూపాయలు
- బకాయిలు వసూలు కాక బ్యాంకర్ల అవస్థలు



ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

పొదుపు రుణాలు కొందరి స్వార్థం కారణంగా పక్కదారి పడుతున్నాయి. కోట్ల రూపాయల మేర పొదుపు గ్రూపులకు బ్యాంకర్లు రుణాలు ఇచ్చారు. రుణ బకాయిలు వసూలు కాక తలలు పట్టుకుంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు అంద జేస్తున్నారు. బకాయిల వసూళ్ళ కోసం వెళ్లిన సిబ్బందికి రుణాలు తీసుకున్న సంఘాల సభ్యులు కనిపించడం లేదు. డమ్మీ పొదుపు గ్రూపులతో కొందరు ఆర్‌పిలు, సిఒలు రుణాలు తీసుకున్నట్లు వెల్లడవుతుంది. గుంటూరు మెప్మా శాఖకు చెందిన సిఎంఎం, ఆర్‌పిలు అక్కడి యూనియన్ బ్యాంక్‌లో కోటి రూపాయలు పైగా బోగస్ పొదుపు గ్రూపులతో రుణం పొందిన విషయం వెల్లడైంది. దీంతో జిల్లాల్లో అన్ని ప్రాంతాల్లో విచారణ జరుపుతున్నారు.బాపట్ల జిల్లాలో కూడా బోగస్ పొదుపు గ్రూపుల ద్వారా లక్షల్లో రుణాలు దారి మళ్లీనట్లు తెలుస్తుంది.

ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా బాపట్ల జిల్లాలోని చీరాల, అద్దంకి, ఇంకొల్లు, కారంచేడు, మార్టూరు, రావినూతల,పర్చూరు, సంతమాగులూరు శాఖల ద్వారా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో డిఆర్‌డిఎ, పట్టణ ప్రాంతాల్లో మెప్మాలకు చెందిన పొదుపు గ్రూపులకు భారీ ఎత్తున రుణాలు ఇచ్చారు.ఒక్క సహకార బ్యాంకు ద్వారానే జిల్లాలో జగనన్న తోడు,సిఎం స్వనిధి,పొదుపు సంఘాలకు రూ.2,657 కోట్లు, పొదుపు గ్రూపులకు రూ 22.96 కోట్ల రుణాలు ఇచ్చారు. సిఎం స్వనిధి ద్వారా (స్ట్రీట్ వెండర్స్ రుణాలు) చీరాల పట్టణంలో రూ.51.73 లక్షలు,అద్దంకిలో రూ. 52.62 లక్షల రుణాలు ఇచ్చారు. ఈ రుణాలు ఎవరి కిచ్చారో అర్థం కాలేదంటున్నారు. దాదాపు రూ.23 కోట్ల రూపాయల రుణాలు ఇస్తే అవి వసూలు కాక,పీల్డ్ లోకి వెళితే రుణాలు ఎవరి కిచ్చారో తెలియడం లేదు. బోగస్ ఖాతాలకు ఆ రుణాలు దారి మళ్లి నట్లు తెలుస్తుంది. దీంతో ఎమి చేయాలో తెలియక సహకార బ్యాంకు అధికారులు జిల్లా కలెక్టరుకు రుణ బకాయిలపై నివేదిక ఇచ్చారు.ఈ విషయమై దృష్టి సారించిన మెప్మా అధికారులకు పొదుపు గ్రూపుల రుణాలు,సిఎం స్వనిధి ▶ 2లో

వాతావరణ సమతుల్యతలో మార్పు

- ఓ వైపు మండుతోన్న ఎండలు, మరోవైపు వానలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- సముద్రం కోతతో ముంపు ముప్పు



ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ఈనెలలో ఓ వైపు తీవ్రమైన ఎండలు.47 డిగ్రీలు వరకూ ఉష్ణోగ్రతలు నమోవుతున్నాయి. జనం ఎండలకు తల్లడిల్లిపోతున్నారు. వడగాలులు తీవ్రంగా వీచాయి. ఈవారంలో రెండు మూడు రోజులపాటు వీటిప్రభావం తీవ్రంగానే ఉంది. జనం బయటకు రాలేకపోయారు. మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. వేసవిలో అకాల వర్షాలు పడ్డాయి. ఒక్కసారిగా వాతావరణం వానలకు చల్లబడుతోంది. మళ్లీ ఎండలకు ఉక్కపోతతో కూడిన వాతావరణం కనిపిస్తోంది. ఆవిరిగాలులు వస్తున్నాయి. వేసవిలో ఇలా ఎండలకు భారీగా ఉష్ణోగ్రత నమోదు కావడం.. మళ్లీ వానలకు చల్లబడటం జరుగుతోంది.అయితే ఈ రెండు మార్పులకు మధ్య జరిగే వాతావరణంలోని మార్పులు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. జనం రెండు రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఎండలకు రోడ్లన్నీ నిర్మానుష్యమవుతున్నాయి. చిరువ్యాపారులు ఎండలకు ఉపాధి కోల్పోతున్నారు. సీజనల్‌గా వచ్చే కాయలు అమ్ముకునే వ్యాపారులు పడుతోన్న కష్టాలు చెప్పవికావు. ఉపాధి కూలీలు ఎండలకు పనులు చేయలేక పోతున్నారు. గంటసేపు పనులు చేయగానే ఒంటిలో ఉన్ననీరంతా చెమటరూపంలో పోతోంది. ఇప్పటికే ఇద్దరు చనిపోయారు. వర్షాలు పడ్డ మరుసటిరోజున ఉక్కపోస్తోందని, కాసేపటికే చెమటకు ఒళ్లంతా తడిచిపోతోంది. ఎండలు బాగా కాచిన రోజున వడగాలులకు పనులు చేయలేక సొమ్మసిల్లుతున్నారు. కరెంటు కోతలకు ఉండే పరిస్థితి లేకుండా పోయింది. ఇలా వాతావరణంలో మార్పులు ప్రజల జీవన విధానంపై ప్రతికూల ప్రభావం చూపు తున్నాయి. చెట్లు కొట్టేయడం, కాలుష్యం పెరగడం వల్లనే ఇలాంటి ▶ 2లో

అద్దె షాపులకు ముందుకు రాని వ్యాపారులు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీ ఆదాయాన్ని సమకూర్చుకోవాలని చూస్తోంది. అందులో భాగంగా షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. పట్టణంలోని కూరగాయల మార్కెట్ ప్రదేశంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. నిర్మాణంలో భాగంగా అద్దె గదులు దక్కించుకున్న వ్యాపారులు గుడ్‌విల్ ఆక్షన్ కింద గదుల నిర్మాణాలకు అయ్యే ఖర్చు భరించాల్సి ఉంది. అద్దె గది దక్కించుకున్న తరువాత ఐదేళ్ల పాటు రూ.2,500 మించకుండా అద్దె వసూలు చేయాలని, ఆ తరువాత 15 శాతం అద్దె పెంపుతో 25 సంవత్సరాల పాటు గదిని వేలం పాటలో దక్కించుకున్న వ్యాపారికి హక్కులు కల్పించేలా నిర్ణయించారు. ఈ విధానాలకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. షాపింగ్ కాంప్లెక్స్‌పై వ్యాపారస్తులు నిరాసక్తత చూపుతున్నట్లు తెలిసింది.

మార్కాపురం మున్సిపాలిటీ దినదినాభివృద్ధి చెందుతోంది. పట్టణ జనాభా పెరుగుతోంది. దానికి తగిన విధంగా సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ అధికారులు భావించారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ప్రస్తుతం కొనసాగుతున్న కూరగాయల మార్కెట్ స్థానంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే మరింత ఆదాయం పెంచుకోవచ్చునేది అధికారుల ఆలోచన. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం అంతా గుడ్‌విల్ ఆక్షన్ కింద గదిని అద్దెకు దక్కించుకున్న వారే భరిస్తున్నందున... మున్సిపాలిటీ నిధులతో అవసరం లేకుండా ఆదాయాన్ని పెంచుకోవాలని మున్సిపల్ అధికారులు ఆలోచించారు.

గుడ్‌విల్ ఆక్షన్ కింద షాపింగ్ కాంప్లెక్స్‌లో 40 గదుల కింద, మరో 40 పై అంతస్తులో నిర్మాణం చేపట్టాలని తలచారు. ఒక్కో గది వెడల్పు, పొడవు 12 ఇంటు 12 కొలతలతో నిర్మించేందుకు డిజైన్ చేశారు. అందులో పార్కింగ్ సమస్య లేకుండా జాగ్రత్త పడ్డారు. వాస్తవంగా కూరగాయల మార్కెట్ ప్రదేశం షాపింగ్ కాంప్లెక్స్‌కు అనుకూలమైనదే. పట్టణానికి నడిబొడ్డు అని కూడా చెప్పాలి. షాపింగ్ కాంప్లెక్స్ పూర్తయితే అన్ని రకాల వస్తువులు ఒకే ప్రదేశంలో లభిస్తే కొనుగోలుదారులకు సైతం సులువుగా ఉంటుంది.





మున్సిపల్ కార్యాలయ ముఖ ద్వారం, కూరగాయల మార్కెట్ ముఖ ద్వారం

గత నెల 24న పైన పేర్కొన్న విధానం ద్వారా మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి రంగారావు వేలం పాటలు నిర్వహించారు. వేలం పాటలో గది కావాలని పాల్గొన్నవారు ఐదుగురికి మించరు. దీంతో షాపింగ్ కాంప్లెక్స్ గుడ్‌విల్ ఆక్షన్ ద్వారా నిర్మించేందుకు వీలుపడలేదు. వ్యాపారస్తులు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ముందుకు రాకపోతే... ప్రభుత్వం, మున్సిపాలిటీ గానీ సొంతంగా నిధులు సమకూర్చి నిర్మించడం ఇప్పట్లో జరగని పని. వ్యాపారులకు అద్దె కూడా పెద్ద భారమేమీ కాదు. ప్రైవేటు గదుల అద్దెకు.. మున్సిపల్ అధికారులు నిర్ణయించిన అద్దెకు చాలా వ్యత్యాసం ఉంది. వ్యాపారస్తులు ఎందుకు ముందుకు రావడం లేదనేది అర్థం కావడం లేదు. వ్యాపారస్తులు సహకరిస్తే తక్కువ అద్దెతో గదిని దక్కించుకోవడంతో పాటు ప్రజలకు సకలం ఒకేచోట అందుబాటులో ఉండేందుకు సహకరించిన వారవుతారు. ఇక్కడ ఉన్న కూరగాయల మార్కెట్‌ను ఎలాగూ తర్లుపాడు రోడ్డులోని వాటర్ ట్యాంకు ప్రదేశంలో నిర్మించాలని తలచారు. అక్కడ కూరగాయల మార్కెట్‌తో ట్రాఫిక్ సమస్య కూడా పెద్దగా ఉండదు. అధికారులు మాత్రం మరోమారు వేలం పాట నిర్వహించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ఎట్టిపరిస్థితుల్లోనూ ఆపేది లేదని చెబుతున్నారు. వ్యాపారస్తులను ఏ విధంగా అధికారులు మలుచుకుంటారో చూడాలి మరి.

మృతులను స్మరిస్తూ క్యాండిల్ ర్యాలీ

ప్రజాశక్తి-అద్దంకి

హెచ్ఐ/ఎయిడ్స్‌తో చనిపోయిన కుటుంబాలకు మనవంతు సానుభూతి తెలుపుతూ చనిపోయిన వారికి ఆత్మ శాంతి కలగాలని ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా అద్దంకి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అద్దంకి సిహెచ్‌సి డాక్టర్ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో 40 మిలియన్ మంది హెచ్ఐవి/ఎయిడ్స్ బాధితులు ఉన్నారని అన్నారు. ఈ వ్యాధి ప్రబలకుండా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. చాలా మంది యువత ఈ వ్యాధిబారిన పడటం బాధాకరమైన విషయమని అన్నారు. విచ్చలవిడి శృంగారం వల్ల కలిగే నష్టాలపై ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థలపై ఉందని అన్నారు. ప్రతి వ్యక్తి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెచ్ఐవి/ఎయిడ్స్ బాధితులు మందులు సకాలంలో వాడుకునేలా చూడాలన్నారు. ఈ వ్యాధి బాధితుల పట్ల వివక్షత చూపించకూడదని, వారి పట్ల ప్రేమ ఆదరణ కలిగి, వారికి ఆత్మస్థైర్యం కలిగించాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓఆర్‌డబ్ల్యూ కరుణ, పిఈలు రాధ, శివ పార్వతి, పార్వతి, ఐసిటిసి ఏఆర్టీ కౌన్సిలర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జగన్ మాటలకు మోసపోవద్దు: గొట్టిపాటి

ప్రజాశక్తి-అద్దంకి



ఇళ్లస్థలాల పేరుతో జగన్‌రెడ్డి దేనికి ఉపయోగపడని పనికిరాని కాగితంతో సమానమైన పట్టాలను పేదలకు ఇస్తున్నాడని సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో తేలిపోయిందని జగన్ కుట్రల్ని నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేదలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. సంవత్సరానికి రూ.5 లక్షల చొప్పున 5ఏళ్లలో పేదలకు 25 లక్షల ఇళ్లు కట్టిస్తానని హామీ ఇచ్చిన జగన్ 4ఏళ్లలో ఎన్ని ఇళు కట్టించాడు? ఎందరు పేదలకు న్యాయం చేశాడు, టిడిపి హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు నేటికీ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. జగన్ ఇచ్చిన సెంటుపట్టా భూముల వెనుక అధికారపార్టీ నేతల భారీ అవినీతి దాగి ఉందని, ఇంటి నిర్మాణం, సెంటు పట్టాల పేరుతో జగన్ కావాలనే ప్రజల్ని, మరీ ముఖ్యంగా పేదల్ని వంచిస్తున్నాడని, నివాసానికి పనికిరాని సెంటు పట్టాలతో పేదలకు ఏం ఉపయోగం ఉంటుందో ముఖ్యమంత్రే సమాధానం చెప్పాలంటూ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశచరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాజధానిలో 5శాతంభూమిని పేదలనివాసానికి కేటాయించిన ఘనత చంద్రబాబు గారికి మాత్రమే దక్కుతుందని అన్నారు. తాడేపల్లిలో తన పార్టీ కార్యాలయ నిర్మాణానికి క్లియర్ పట్టా ఉన్న కోట్ల విలువైన 2 ఎకరాల భూమిని కేటాయించిన జగన్‌రెడ్డి, పేదల ఇళ్ల కోసం ఎందుకూ పనికిరాని పట్టాలను కేటాయించడం వారిని వంచించడం కాదా? అని ప్రశ్నించారు. ఇళ్ల స్థలాల పేరుతో చిత్తు కాగితంతో సమానమైన పట్టాలను జగన్‌రెడ్డి పేదలకు ఇస్తున్నాడని సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో తేలిపోయిందని స్పష్టం చేశారు. ప్రభుత్వమిచ్చే ఇళ్లపట్టాలు అమ్మకానికి, రుణం పొందడానికి పనికిరావని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చెప్పలేదా అని ప్రశ్నించారు? నిజమైన పేదలపక్షపాతి చంద్రబాబేనని. కాబట్టే సీఆర్డీఏ చట్టంలోనే రాజధాని ప్రాంతంలో 5శాతం భూమిని పేదల ఇళ్లకు కేటాయించడం జరిగిందన్నారు. జగన్‌రెడ్డికి పేదలపై ప్రేమాభిమానాలే ఉంటే చంద్రబాబు గతంలో కట్టించిన 5వేలఇళ్లను 4ఏళ్లుగా ఎందుకు ఇవ్వలేదో తెలుపాలన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా చంద్రబాబు ఒక్కరే ప్రజా రాజధాని అమరావతిలో 5శాతం భూమిని పేదలకు కేటాయిస్తూ 2014 డిసెంబర్లోనే చట్టం చేశారని తెలిపారు. పేదలకు న్యాయం చేయాలన్న తాపత్రయమే జగన్ రెడ్డికి ఉంటే, తాడేపల్లిలో సీఎం నివాసం పక్కనే ఉన్న వెయ్యి పేదలఇళ్లను రాత్రికి రాత్రి ఎందుకు ఖాళీ చేయించాడో తెలపాలన్నారు? అమరావతి రాజధానే కాదు శ్మశానమని, ఎడారని, నిర్మాణాలకు పనికిరాదని దుష్ప్రచారం చేయించిన జగన్ ఇప్పుడు అక్కడే పేదలకు ఇళ్లపట్టాలివ్వడం అతని ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు.

కబ్జా చేస్తాం.. అమ్మేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

వారిని ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆక్రమణ దారులపై చర్యలు తీసుకొనేలా పోరాటం చేసేందుకు ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు సన్నద్ధమౌతున్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

పిసి కేశవరావు, ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్



సూరా పాపిరెడ్డినగర్‌లో పేదల జాగాను అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్న బలసాని పోలయ్య, బెంజిమెన్‌లపై చర్యలు తీసుకోవాలి. ఇప్పుడు అక్రమార్కుల కన్ను 894 సర్వే నంబరులోని వాగు పోరంబోకు భూమిపై పడింది. దాన్ని ఆక్రమించి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ఆక్రమణదార్లలో ఒకరైన బెంజిమెన్‌ను మార్కెట్ యార్డ్ ఉద్యోగం నుంచి తొలగించాలి.

బోగస్ గ్రూపులతో రుణాలు

(మొదటిపేజీ తరువాయి)

రుణాల్లో దారి మళ్లినట్లు గమనించారు. ఒక పొదుపు గ్రూపుకు ఓ బ్యాంక్ ద్వారా రుణాలు ఇవ్వాల్సిఉంది. చాలా సంఘాలు రెండు, మూడు బ్యాంకుల రుణాలు పొందినట్లుగా గుర్తించారు. ఇవి కాకుండా బోగస్ గ్రూపులు ద్వారా రుణాలు పొందినట్లు తెలిసింది. ఈ ఖాతాల తనిఖీలకు వెళ్ళిన వారికి కొన్ని పొదుపు సంఘాలు లేనట్లు తేలింది. ఒక్క సహకార బ్యాంక్ ద్వారానే కోట్ల రూపాయల్లో రుణాలు దారి మళ్ళినటు లేలింది. అన్ని బ్యాంకుల ఖాతాలను పూర్తి స్థాయిలో పరిశీలిస్తే భారీఎత్తున చోటు చేసుకున్న అవకతవకలు బయటకు వస్తాయని చెబుతున్నారు.

పొదుపు రుణాల్లో అవినీతి చోటు చేసుకున్న ఘటనలు గతంలో వెలుగు చూశాయి. ఆ సమయంలో విచారణ జరుపుతున్నారు. చర్యలు శూన్యంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోని డిఆర్‌డిఎ, పట్టణ ప్రాంతాల్లో మెప్మా విభాగంలో రీసోర్సు పర్సన్లు(ఆర్‌పిలు) కమ్యూనిటీ ఆర్గనైజర్లు(సిఒలు) బ్యాంకు ఉద్యోగుల సహకారంతో భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారు. బ్యాంకుల్లో కొందరు సిబ్బంది మీకింత, మాకింత అన్న లెక్కన కమీషన్లకు కక్కుర్తిపడి ఆర్‌పిలు, సిఒలకు సహకరిస్తున్నారు. కొన్ని పొదుపు సంఘాలు ఆన్‌లైన్ అయినప్పటికీ వేరు వేరు బ్యాంకుల్లో రుణాలు పొందడంలో ఆయా బ్యాంకుల సిబ్బంది పాత్ర ఉంటుంది. పోటీలు పడి రుణాలిచ్చి అవి వసూలు కానప్పుడు మాత్రమే అక్రమాలు వెలుగు చూస్తున్నాయి.

వాతావరణ సమతుల్యలతో మార్పు

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితులు వస్తున్నాయి. ఇక సముద్రం కోతకు గురవడం కూడా ఆందోళన కలిగిస్తోంది. సముద్రం కోత కారణంగా ముంపు ముప్పు తప్పదని నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడైంది. రాష్ట్రంలోని తీర ప్రాంతమంతా కోతకు గురవుతున్నట్లు గుర్తించారు. ప్రజలు ముంపు ముప్పును ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరికలు వచ్చాయి. అయితే తీర ప్రాంతంలో ఉన్న జిల్లా భూభాగం కొంత ఎత్తులో ఉంది. దీంతో మిగతా జిల్లాలతో పోలిస్తే ముప్పుతక్కువగా ఉంది. తుఫానులు సంభవించినపుడు మాత్రం శింగరాయకొండ వద్ద కొన్ని సార్లు సముద్రం ముందుకొచ్చింది. చీరాల ప్రాంతం కొంత ఎత్తు తక్కువగా ఉన్నందున అక్కడ కోతకు ముప్పు ఉంది. మత్యకారులకు ఈ ముంపు పొంచి ఉంది. ఏదేమైనా వాతావరణంలోని మార్పులు సమతుల్యలోపానికి కారణాలుగా కనిపిస్తున్నాయి. అందుకే సకాలంలో వర్షాలు పడకపోవడంతో వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది.

పూజల్లో ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి-వెలిగండ్ల: వైసిపి వెలిగండ్ల మండల మాజీ కన్వీనర్, గోకులం పంచాయతీ సర్పంచి చిలకల వెంకటేశ్వర్లురెడ్డి ఆహ్వానం మేరకు మండల పరిధిలోని జిల్లెలపాడు గ్రామంలో నిర్వహించిన అంకాలమ్మతల్లి మొక్కుబడి కార్యక్రమంలో టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేపై అసంతృప్తిగా ఉన్న నేతలు వెంకటేశ్వరరెడ్డి బాటలో పయనించే అవకాశాలు ఉన్నట్లు పలువురు చర్చించు కుంటున్నారు.

అప్పులు, ఆర్థిక లావాదేవీలు

అనుమానంతోనే కోటా రాధ హత్య

స్నేహితుడి పేరుతో చాటింగ్ ● డబ్బులిస్తానని నమ్మించి కిరాతకంగా హత్య చేసిన భర్త?




నిందితుడు మోహన్‌రెడ్డి, హతురాలు రాధ (ఫైల్ ఫొటోలు)

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండలంలోని జిల్లెళ్లపాడు వద్ద ఇటీవల మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన పాఠకులకు విదితమే. ఈ హత్య కోటా రాధ తన చిన్ననాటి స్నేహితుడు కేతిరెడ్డి కాశిరెడ్డి బాగు కోరి తన వద్ద ఉన్న కొంత నగదు, తన భర్తతో కొంత నగదు మొత్తం దాదాపు రూ.70 లక్షలకుపైగా ఇచ్చారు. అయితే కాశిరెడ్డి ఉద్యోగం పోవడంతో సొంతంగా కంపెనీ పెట్టాలని, అందుకు నగదు కావాలని దంపతులను కోరాడు. రాధ కాశిరెడ్డిల స్నేహంతోనే భార్యాభర్తల నుంచి నగదు తీసుకున్నాడు. అయితే నగదు తీసుకున్నప్పటి నుంచి కాశిరెడ్డి ఫోన్ ఎత్తకపోవడం, సమాధానం చెప్పకపోవడంతో రాధ, మోహన్‌రెడ్డిల మధ్య తరచూ గొడవలు జరిగి విడాకుల వరకు వెళ్లింది. పెద్దమనుషులు, కుటుంబ సభ్యుల ప్రమేయంతో ఆ నిర్ణయాన్ని సర్దుబాటు చేసుకున్నారు. అప్పటి నుంచి మోహన్‌రెడ్డి భార్య రాధతో, ఆమె తల్లిదండ్రులతో మంచిగానే నటిస్తూ రాధపై ఎనలేని ద్వేషాన్ని పెంచుకున్నాడు. దీనికి తోడు రాధ స్నేహితుడు కాశిరెడ్డి తీసుకున్న నగదు ఇవ్వకపోగా కాశిరెడ్డి కుటుంబ సభ్యులకు, భార్యకు ఫోన్ చేయకుండా సిమ్‌లను మారుస్తూ మెసేజ్ చేసే విధానాన్ని మోహన్‌రెడ్డి గ్రహించాడు. దీనిని అదునుగా తీసుకొని మోహన్‌రెడ్డే ఒక కొత్త సిమ్‌ను కాశిరెడ్డి పేరుతో తీసుకొని తన భార్యతో కాశిరెడ్డి లాగా మెసేజ్ చేయడం, చాటింగ్ చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలో రాధ తన తల్లిదండ్రుల స్వగ్రామమైన వెలిగండ్ల మండలంలోని జిల్లెల్లపాడు గ్రామానికి చౌడమ్మతల్లి కొలుపులకు భర్త అనుమతితో చిన్న కుమారుడిని తీసుకొని ఈ నెల 11వ తేదీన వచ్చింది. దీనిని అదునుగా చేసుకొని రాధను హతమార్చి రాధ స్నేహితుడు కాశిరెడ్డిని ఆ కేసులో ఇరికించేలా పథకం వేసుకున్నాడు. ఆ పథకానికి అనుగుణంగా ఈ నెల 15వ తేదీన కాశిరెడ్డి తన సొంత కారులో పిడుగురాళ్ల వరకు వచ్చాడు. అక్కడ తన కారును ఉంచి బాడుగ కారులో కనిగిరి వచ్చి కాశిరెడ్డి లాగే తనకు బెంగుళూరులో ఉద్యోగం వచ్చి ఒక్కసారిగా మొత్తం నగదు ఇవ్వలేనని, ప్రస్తుతం తన వద్ద రూ.2 లక్షలు ఉన్నాయని, కనిగిరికి నీవు ఒక్కదానివే వచ్చి తీసుకెళ్లాలని, నీ వెంట ఎవ్వరిని తీసుకొని రావద్దని మెసేజ్ చేశాడు. దీన్ని నమ్మిన రాధ కనిగిరికి వెళ్లింది. అయితే మోహన్‌రెడ్డి ముందుగా వేసుకున్న పథకం ప్రకారం కారులో ఎక్కించుకొని కనిగిరి శివారు ప్రాంతలోకి తీసుకెళ్లి అక్కడ ఆమె చున్నీతో గొంతు బిగించాడు. అనంతరం కసితీరా ముఖంపై, శరీరంపై కొట్టి, సిగరెట్లతో కాల్చి అనంతరం రోడ్డు ప్రమాదంలాగా చిత్రీకరించేందుకు కారుతో తొక్కించాడు. ఆమె మృతదేహంతో పాటు ఆమె వద్ద ఉన్న హ్యాండ్ బ్యాగ్, ఆమె కుమారుడి కోసం తీసుకున్న దుస్తులు, కాళ్ల బూట్లు, జిల్లెలపాడు అడ్డరోడ్డు పక్కన పడవేసి ఏమీ తెలియనట్లు మోహన్‌రెడ్డి వెళ్లిపోయాడు. రాధ హత్యకు గురైన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అల్లుడు మోహన్‌రెడ్డికి ఫోన్ చేయగా తాను వచ్చేంత వరకు ఆమె సెల్‌ఫోన్ ఓపెన్ చేయవద్దని, తాను వచ్చి ఓపెన్ చేస్తానని చెప్పాడు. ఈ నేరమంతా కాశిరెడ్డిపైకి పోతుందన్న ఆలోచనతోనే మోహన్‌రెడ్డి ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. పోలీసులు కూడా కాశిరెడ్డిని అనుమానించి వారి కుటుంబ సభ్యులను విచారించారు. దీంతోపాటు పోలీసులు టెక్నాలజీని ఉపయోగించి కాశిరెడ్డితోపాటు రాధ భర్త మోహన్‌రెడ్డిపై నిఘా ఉంచారు. మోహన్‌రెడ్డి హైదరాబాద్ నుంచి జిల్లెలపాడు వచ్చేందుకు కనీసం అయిదారు గంటలు పడుతుంది. భార్య హత్యకు గురైందని మామ సుధాకర్‌రెడ్డి అల్లుడు మోహన్‌రెడ్డికి చెప్పినప్పటికీ మోహన్‌రెడ్డి వచ్చేందుకు దాదాపు 12 గంటల సమయం తీసుకోవడంతో పోలీసులకు, బంధువులలో కొంతమందికి అనుమానం వచ్చింది. ఈ క్రమంలో రాధ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం మోహన్‌రెడ్డి స్వగ్రామమైన తెలంగాణ రాష్ట్రంలోని సూర్యపేట జిల్లా కోదాడకు తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. అప్పటి నుంచి అనుమానం ఉన్నందున మోహన్‌రెడ్డి సెల్‌ఫోన్‌పై నిఘా పెట్టారు. అంత్యక్రియల అనంతరం కోదాడలో ఉండాల్సిన మోహన్‌రెడ్డి సెల్ సిగ్నల్ కోదాడ-వినుకొండ మధ్యలో ఉన్నట్లు గుర్తించి మోహన్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కనిగిరి డిఎస్పీ కార్యాలయంలో, సిఎస్ పురం పోలీస్‌స్టేషన్‌లో విచారణ చేపట్టాగా తాను చున్నీతో గొంతు బిగించి హత్య చేశానని, ఇందులో ఎవరూ లేరని ఒప్పుకున్నాడు. పోలీసులు ఆ కారులో ఇంకా నిందితులు ఉన్నట్లు గుర్తించి విచారణ చేస్తున్నారు. రాధ తన చిన్ననాటి స్నేహితుడికి అప్పు ఇవ్వడంతోపాటు అతడితో సన్నిహితంగా ఉందని రాధపై అనుమానం పెంచుకొని ఈ దురాగతానికి పాల్పడ్డాడు. అయితే ఈ పథకం కొన్ని నెలల నుంచి సాగుతోందని, అందుకు ముందుగానే రాధ పేరుతో ఒక కోటి రూపాయల వరకు ఇన్సూరెన్స్ చేసి ఇలా హత్య చేస్తే ప్రమాదం కింద ఇన్సూరెన్స్ నగదు వస్తుందని ఆశపడినట్లు తెలుస్తోంది. తల్లిదండ్రులు మధ్య సంతోషంగా ఉండాల్సిన ఇద్దరు చిన్నారులు తల్లి మృతితో దిగాలుపడిపోయారు. తల్లి చనిపోవడం, తండ్రి జైలుకు పోవడంతో దిక్కులేని వారిగా మిగిలిపోయారు.

తీర ప్రాంత గ్రామాల్లో శాంతి భద్రతలు నెలకొల్పేందుకు..

ముందస్తు పోలీస్ పికెటింగ్: సిఐ మల్లికార్జునరావు



ప్రజాశక్తి-వేటపాలెం

సముద్ర తీర ప్రాంతాలలో శాంతి భద్రతలు నెలకొల్పేందుకు ముందస్తు పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు చీరాల రూరల్ సిఐ ఏ మల్లికార్జునరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత కొంతకాలంగా రామాపురం, కటారివారిపాలెం గ్రామాల మధ్య విభేదాలు ఉన్నాయన్నారు. చిన్న చిన్న అపోహలతోనే విభేదాలు తారస్థాయికి చేరాయని చెప్పారు. ఈ నేపథ్యంలోనే చట్టపరమైన చర్యలు కూడా తీసుకున్నామని అన్నారు. మళ్లీ గొడవల నేపథ్యంలో ఆయా గ్రామాలలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు చీరాల రూరల్ వేటపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని సిబ్బంది ముందస్తు పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రశాంత వాతావరణ ఉందని ప్రజలు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అదేవిధంగా వేసవికాలం దృష్ట్యా సముద్ర స్థానాలకు వచ్చే ప్రజలను దృష్టిలో ఉంచుకొని వారికి పూర్తి అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. శనివారం రాత్రి మత్స్యకార గ్రామాల పెద్దలతో జరిగిన చర్చలు ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిసింది.

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై చర్యలు



బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిని పట్టుకున్న పోలీసులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. శనివారం రాత్రి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలలోని జిల్లా పోలీస్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న 96 మందిని అదుపులోకి తీసుకొని వారికి కౌన్సెలింగ్ ఇచ్చి కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిని ఉపేక్షించబోమని అన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాంటి వారిని అదుపులోకి తీసుకొని కేసులను నమోదు చేసి న్యాయస్థానం ఎదుట హాజరు పరుస్తామన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి ఇప్పటివరకు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న 695 మందిని అదుపులోకి తీసుకుని వారిపై 685 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ వారిలో వారు గొడవలుపడి హత్యలు, హత్యయత్నాలకు దారితీసిన ఘటనలు, ప్రజాశాంతికి భంగం వాటిల్లిన ఘటనలు గమనిస్తూ వుంటున్నామన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి మద్యం సీసాలను ఎక్కడపడితే అక్కడ పడవెయ్యడం వల్ల లేదా వదిలి వెళ్లడం వల్ల నోరులేని మూగజీవాలకు గాయాలు అవుతున్నాయన్నారు. పాదచారులకు కూడా చాలా ఇబ్బందికరంగా పరిణమిస్తుందన్నారు. వాటిని కట్టడిచేసి, ప్రజాశాంతికి భంగం వాటిల్లకుండా వుండడానికి నిత్యం నిర్మానుష్యమైన ప్రదేశాలలో, బహిరంగ ప్రదేశాలలో గస్తీలు నిర్వహిస్తూ వుండాలని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారు లను ఆదేశించారు. తరుచూ వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలన్నారు. దీని వలన రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. మహిళలు, పిల్లలు తిరిగే ప్రదేశాలలో, రోడ్ల పక్కన గాని, చెట్ల కింద గాని, వాహనాలలో గాని బహిరంగ ప్రదేశాలలో ఎవరైనా మద్యం సేవిస్తున్నా, ప్రజా జీవనానికి భంగం వాటిల్లే విధంగా వ్యవహరిస్తున్నా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, లేదా టోల్ ఫ్రీ నెంబర్‌లు 100, 112 లకు, లేదా ఎస్పీ బాపట్ల హెల్ప్‌లైన్ నెంబర్ 8333813228కు కాల్‌చేసి సమాచారం అందించాలన్నారు.



బాలుడి మృతదేహాన్ని సందర్శించిన టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని జవహర్‌లాల్ వీధికి చెందిన కొలిపాకుల ధనుంజయ్ కుమారుడు ధీరజ్(12) స్నేహితులతో కలిసి ఆడుకునేందుకు స్థానిక వెంకటేశ్వర స్వామి టెంపుల్ ప్రాంతానికి వెళ్లాడు. క్రికెట్ ఆడిన అనంతరం పైపుతో మోటర్ వద్ద స్నానం చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. మిగిలిన ఐదుగురు చిన్నారులకు ప్రమాదం తప్పిపోయింది. షాక్‌కు గురైన బాలుడు ధీరజ్‌ను స్థానిక ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించినప్పటికీ ఆపాటికే బాలుడు మృతి చెందాడు. ఆటలాడుకున్నందుకు వెళ్లి మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు రోదన మిన్నంటింది. కనిగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి బాలుడు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఏటీఎం దగ్ధం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్



దగ్ధమవుతున్న ఎటిఎం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఏటీఎం దగ్ధమైంది. ఈ ఘటన మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఎస్‌బిఐ ఏటిఎంలో ఆదివారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. ఏటీఎంలో ఉన్న విద్యుత్ సామగ్రి నుంచి అధిక ఉష్ణోగ్రత వెలువడంతో ఆ కారణంగా అక్కడి విద్యుత్ తీగలు తెగి మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు హుటాహుటిన అగ్నిమాపక కేంద్రానికి సమాచారం చేరవేయడంతో సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఏటీఎంలోని సామగ్రి మొత్తం అగ్ని కీలలకు ఆహుతయ్యింది. అయితే మూడు ఏటీఎం మెషిన్లలోని నగదులో ఒక్క నోటు కూడా కాలకపోవడం విశేషం.



కాలి బూడిదైన వరికుప్ప

పిడుగుపాటుకు వరికుప్ప దగ్ధం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

పిడుగుపాటుకు వరికుప్ప దగ్ధం అయిన సంఘటన శనివారం బాపట్ల మండలం మురుకుండ పాడు గ్రామం పొలాల్లో జరిగింది. హఠాత్తుగా కురిసిన వర్షంతో పాటు పిడుగు పడటంతో రవీంద్రకు చెందిన వరికుప్ప అగ్నికి బుగ్గి పాలైంది. సుమారు రూ.50 వేల ఖరీదు చేసే పంట నష్టం వాటిల్లిందని బాధితుడు వెల్లడించాడు. అరుగాలం కష్టించి పండించిన పంట బూడిదగా మారిందని వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు. సంఘటన స్థలానికి ఆర్ఓ విజయలక్ష్మి సందర్శించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

360 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పర్చూరు: శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని, గుంటూరు వారి సహకారంతో చిన్మయా మిషన్, పర్చూరు వారు జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 360 మందికి కంటి శుక్లముల పరీక్షలు నిర్వహించగా, 262 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. వీరిని శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా ప్రయాణం, భోజన వసతులతో శుక్లముల శస్త్ర చికిత్స నిర్వహిస్తారన్నారు. పాబోలు రాధాకృష్ణమూర్తి, ఇందిరాదేవి గార్ల జ్ఞాపకార్థం ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు ఉదయ భాస్కర్ తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ షాయిజా, డాక్టర్ మెహబూబ్, పిఆర్ఓ నాగబాబు, సిబ్బంది వైద్య సేవలు అందించారు. శిబిరంలో కాసా అజయబాబు, కొసన వెంకటేశ్వర్లు, కటారి సత్యం, తాటి లింగేశ్వరరావు, గుండిమెడ ఆంజనేయరావు, కొత్తూరి వెంకటేశ్వరరావు, సుబ్బారావు, దుర్గ ప్రసాద్, రావి నాగయ్య, అమర్‌బాబు, శివరామ క్షిషణ, పూరా కాశీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సాగులో ఉన్న మునగ తోట

మునగ సాగుతో అధిక లాభాలు

ప్రజాశక్తి-కొల్లూరు: మండల పరిధిలోని ఉపాధి హామీ పథకం ద్వారా చిన్న సన్నకారు రైతులకు పూర్తిగా సబ్సిడీతో అందిస్తున్న మునగ తోటల సాగుతో అధిక లాభాలు గడిస్తున్నట్లు మండల ఉపాధి హామీ పథకం ఏపీఎం సురేష్‌బాబు అన్నారు. మండలం లోని కిష్కిందపాలెం, తిప్పలకట్ట, పెదలంక, ఈపూరులంక గ్రామాల్లో మునగ పంటను సాగు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు సూచించారు.



సెల్ టవర్ కోసం తీసిన గుంత

ప్రమాదకరంగా గుంత

ప్రజాశక్తి-అద్దంకి: మండలంలోని మణికేశ్వరం గ్రామంలో ఎయిర్‌టెల్ సెల్ టవర్ నిర్మాణం కోసం తీసిన భారీ గుంత నెలలు గడుస్తున్నా పూడ్చకుండా వదిలి వేయడంతో ప్రమాదకరంగా మారింది. అకాల వర్షాలు కురిసి నీరు చేరితే మూగజీవులు, చిన్నపిల్లలకు ఇబ్బంది కలుగుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తీసిన గోతులను వెంటనే పూడ్చివేయాలని గ్రామ ప్రజలు సంబంధిత అధికారులకు విన్నవించుకుంటున్నారు. సెల్ టవర్ వల్ల రేడియేషన్ ప్రభావం ఉంటుందని, అది తమ పిల్లల భవిష్యత్తుకే కాకుండా ఆరోగ్యపరంగా సమస్యలు తలెత్తుతాయం టూ నెల రోజుల క్రితం స్థానికులు ఆందోళనకు దిగి అడ్డుకున్నారు. నివాస సముదాయాలకు కేవలం 50 అడుగులు దూరంలో ఉండడంతో ప్రమాదాలు సంభవించవచ్చని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సముద్రంపై వేట నిషేధంతో...

ఒడ్డుకు చేరిన బోట్లు, వలలు

నిత్యం పరిశీలించుకుంటున్న మత్స్యకారులు ● మత్స్యకార భరోసాకు కొత్త నిబంధనలతో ఇబ్బందులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

సముద్రంపై వేట నిషేధం మొదలైంది వలలు బోట్లను ఒడ్డుకు చేర్చుకున్న మత్స్యకారులు వాటిని జాగ్రత్త చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు సముద్రంపై వేట నిషేధంలో ఉంటుంది. 61 రోజులు పాటు సముద్ర తీర ప్రాంతంలో ఉన్న మత్స్యకారులు ఎవరు బోటు తీసి వేటకు వెళ్లరాదు. సముద్రం ఒడ్డున పెట్టుకున్న బోట్లు వలలను 61 రోజులు పాటు మత్స్యకారులు వాటిని జాగ్రత్త చేసుకునేందుకు తీవ్ర కసరత్తే చేస్తున్నారు. బోట్లను వలలను మత్స్యకారులు రకరకాలుగా జాగ్రత్తలు తీసుకున్న వైనం సింగరాయకొండ మండలం పాకల సముద్ర తీరంలో కనిపించింది. సముద్రంలో లంగర్ వేసినట్టు ఒక బోటును తాళ్లతో ఒడ్డున కట్టివేసి జాగ్రత్తలు తీసుకున్నారు. మరో బోటును పందిరి వేసి మరీ పందిరి కింద పెట్టారు. మరో బోటుకు ఎండ సైతం తగలకుండా జాగ్రత్త చేయటం కనిపించింది. ఇక వలలనైతే పందిరి కింద వేయడంతో పాటు చుట్టూ వలలు కట్టి మరి జాగ్రత్తలు చేస్తున్నారు.



తాడుతో కట్టి ఉన్న బోటు

బోట్లకు ప్రత్యేకంగా ఇంజన్లు ఉండడంతో వాటిని ఎండకు ఎండనీయకుండా, వానకు తడవనీయకుండా ఇంజన్లపై పరదాలు కట్టి జాగ్రత్త చేశారు. ప్రతిరోజూ మత్స్యకారులు వచ్చి వాటిని చూసుకొని జాగ్రత్తలు చేసుకొని వెళుతున్నారు. ఓ పక్క జగనన్న మత్స్యకార భరోసా కోసం అధికారులు కొత్త నిబంధనలు పెట్టి మత్స్యకారులను రకరకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్న వైనం కనిపిస్తోంది.



పందిరి కింద బోటు

మత్స్యకారులు మత్స్యశాఖ ద్వారా గుర్తింపు కలిగి ఉండటంతో పాటు ఈ సంవత్సరం థంబ్ కూడా వేయాలని వాలంటీర్ ద్వారా సర్వే చేయిస్తున్నారు. వెలుగు అధికారులను కూడా మరో సర్వే చేయాలని ఆదేశించడంతో ప్రతిరోజూ ఏదో ఒక సర్వే జరుగుతోందని, దీంతో తాము పనులు మానుకొని జగనన్న మత్స్యకార భరోసా కోసం బోటు వద్దకు వస్తున్నామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బోటు.. ఎండ నుంచి రక్షణకు ఇలా..



ఇంజన్‌కు ఇబ్బంది లేకుండా టబ్బుతో కప్పివేత..



బోటును జాగ్రత్త చేసుకుంటున్న మత్స్యకారుడు

ఉద్యోగుల వేదనను చెబుదాం

అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటికి ఉద్యోగుల వినతిపత్రం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ఏపీ జేఏసి అమరావతి మూడో దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు 'ఉద్యోగుల వేదనను చెబుదాం' అనే నినాదంతో ఆదివారం బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గ శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ సురేష్ బాబు మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదీన ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. 1.7.2018, 1.1.2019, 1.7.2019, 1.7.2021 పెండింగ్‌లో ఉన్న 4 డీ ఏ అరియర్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. 11వ పిఆర్‌సి కమీషన్ రికమెండ్ చేసిన పేస్కేల్స్ వెంటనే విడుదల చేయాలి. పిఆర్‌సి అరియర్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 2 డీఏలు వెంటనే విడుదల చేయాలి. ముఖ్యమంత్రి పాదయాత్ర లో ప్రకటించినట్లుగా సిపిఎస్‌ను వెంటనే రద్దు చేసి ఓపిఎస్‌లోకి మార్చాలి. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలి. వీఆర్ఏలకు సంబంధించిన ప్రధాన సమస్యలు వెంటనే పరిష్కరించాలి. దీనిపై ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ స్పందిస్తూ ఉద్యోగుల ప్రధాన సమస్యలు వాస్తవమని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేఏసి అమరావతి, బాపట్ల జిల్లా చైర్మన్ సిహెచ్ సురేష్ బాబు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు టి భాస్కరరావు, చీరాల డివిజన్ కోశాధికారి, ఎస్ బాలవెంకట విష్ణు ప్రసాద్, సభ్యులు బి అశోక్ కుమార్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

నిజాయితీకి నిలువుటద్దం సుందరయ్య

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

పుచ్చలపల్లి సుందరయ్య విలువలతో కూడిన రాజకీయాలు నడిపి నిజాయితీకీ నిలువుటద్దంగా నిలిచిన మహోన్నత వ్యక్తి అని సిపిఎం జిల్లా నాయకులు జె జయంతిబాబు, ఎస్‌కె మాబు అన్నారు. సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా ఆదివారం మండల కేంద్రమైన నాగులుప్పలపాడులో సిపిఎం మండల కార్యదర్శి టి శ్రీకాంత్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు నిజాయితీగా ఎలా ఉండాలో ఆచరణలో రుజువు చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. దేశాన్ని, రాష్ట్రాన్ని దోచుకుంటున్న నేటి పాలకులు పేదల పక్షమని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. భూపంపిణీ పేదలకు ఇళ్ల ప్రభుత్వ ఎజెండాగా మార్చిన ఘనత కమ్యూనిస్టులు, ప్రజాఉద్యమాలదేనని అన్నారు. దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణ సారథి సిపిఎం అఖిల భారత తొలి ప్రతిపక్షనేత సుందరయ్య అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నేటి యువతరం సుందరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. విశాలాంధ్రలో ప్రజారాజ్యం కోసం కృషి చేశారని అన్నారు. ప్రతిపక్ష నేతగా పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లి సాధారణ జీవితం గడిపారన్నారు. తన సొంత గ్రామంలో ప్రజలు వ్యాపారస్తుల దోపిడీకి గురవుతున్న నేపథ్యంలో సైకిల్ మీద సరుకులు తెచ్చి పడిన ఖర్చులకే అందజేశారన్నారు. పెత్తందారులకు వ్యతిరేకంగా చిన్నతనంలోనే ఎదురొడ్డి నిలిచారన్నారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా అమ్మనబ్రోలు, కండ్లగుంట తదితర గ్రామాల్లో సుందరయ్య వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చలమయ్య, వెంకట్రావు, యు వెంకటేశ్వర్లు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న జయంతిబాబు



సుందరయ్యకు పూలతో నివాళి అర్పిస్తున్న మాబు

ప్రజాశక్తి 5
సోమవారం 22 మే 2023

ప్రజా సంక్షేమమే ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

తాతా బాగున్నావా..అవ్వ సకాలంలో పింఛను అందుతోందా..అక్క, తమ్ముడు, అమ్మా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అంటూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ యర్రగొండపాలెం మండలం గుర్రపుశాల పంచాయతీ పరిధిలోని గంగుపల్లి గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. గంగుపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సురేష్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న 98 శాతం హామీలను నెరవేర్చిందన్నారు. పార్టీలకు, కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అర్హత ఉంటే ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

కార్యాలయాల చుట్టు తిప్పుకోవద్దు..

వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు, రైతులు, విద్యార్థులను కార్యాలయాల చుట్టు తిప్పుకోవద్దని మంత్రి అధికారులకు సూచించారు. తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మండలానికి జలజీవన్ మిషన్ కింద నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో నకిలీ విత్తనాలు, లూజు విత్తనాలు రైతులు కొనుగోలు చేయరాదని సూచించారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరు కాని ఏడు మంది వాలంటీర్లను తొలగించాలని అధికారులను ఆదేశించారు.



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి సురేష్

విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం..

ప్రజల సౌకర్యార్థం రూ. రెండు కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సబ్ స్టేషన్ ద్వారా నాణ్యమైన విద్యుత్ అందుతుందని చెప్పారు. 1250 వ్యవసాయ కనెక్షన్లకు ఉపయోగపడుతుందని చెప్పారు. మూడు ఫీడర్ల ద్వారా లోఓల్టేజీ సమస్య లేకుండా విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తామంటే అప్పట్లో టిడిపి హేళన చేసిందన్నారు. ఉచితంగా విద్యుత్ ఇచ్చి చూపించిన వ్యక్తి వైఎస్‌ఆర్ కాగా దానికి కొనసాగిస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డే అని తెలిపారు. విద్యుత్ రంగానికి రూ. వేల కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. తొమ్మిదేళ్ల క్రితం మంజూరై నిలిచిపోయిన ఈ గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ కోర్టు కేసు, ఇతర జిల్లాలకు తరలిపోయినా తిరిగి సాధించుకొని ప్రారంభించుకోవడం శుభ పరిణామమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, సర్పంచి వాడాల పద్మ, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాషా, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, సర్పంచులు ఏకుల జయమ్మ ముసలారెడ్డి, దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, విద్యుత్ డిఇఇ నాగేశ్వరరావు, ఎఇఇ తలపాటి అల్లూరయ్య, ఎంపిడిఒ రంగబ్బారాయుడు, తహశీల్దారు దాసు, నంచాయతీ కార్యదర్శి ఎలకా శ్రీను, వైసిపి నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

తర్లుపాడు : పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నాగేళ్లముడుపు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తొలుత సర్పంచి తిరుమల సుబ్బమ్మ, ఎంపిటిసి, వైస్ ఎంపిపి కందుల సుజాత, కలువా బాలగురవారెడ్డి, జెసిఎస్ కన్వీనర్ రామంజనేయరెడ్డి అధ్వర్యంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సూరెడ్డి భూలక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, రాగసముద్రం సర్పంచి రమణారెడ్డి, తాడివారిపల్లి సర్పంచి జాన్‌రత్నం, మీర్జాపేట ఎంపిటిసి దేవిరెడ్డి పార్వతి, రమేష్‌రెడ్డి, గొల్లపల్లి సర్పంచి యక్కంటి శ్రావణి, మండల నాయకులు దేవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సూరెడ్డి సుబ్బారెడ్డి, మండల స్థాయి అధికారులు, ఎంపిడిఒ నరసింహులు, తహశీల్దార్ వరకుమార్, ఎస్ఐ సుధాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

కొమరోలు : పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు తెలిపాడు. కొమరోలు మండలం రాజుపాలెం పంచాయతీ పరిధిలోని ద్వారకచర్లలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకూ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజుపాలెం సర్పంచి పటేల్ ఫిరా, నాయకులు తోట సురేష్, జక్కన్న, కొండ కాశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

కొండపి: అర్హులందరికీ నవ రత్నాల పథకాలను అందించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని వెన్నూరులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు గడపగడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు గోగినేని వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు శ్రీను, సుధాకర్, ప్రసాదు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజీవ్ గాంధీకి నివాళి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా డిసిసి ఆధ్వర్యంలో స్థానిక మంగమూరు డొంక లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈదా సుధాకర రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, ఆయన సేవలు మరువలేనివన్నారు. ,దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడన్నారు. పంచాయతీ రాజ్ చట్టాన్ని తీసుకొచ్చి అభివృద్ధి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ స్టేట్ కో చైర్మన్ ఉద్దండి మల్లికార్జునరావు. పిసిసి సభ్యులు ఎస్‌కె.రసూల్, జిల్లా ప్రధానకార్యదర్శులు దేవిరెడ్డి ఆదినారాయణ రెడ్డి ,సుదర్శి రవి, ఉంగరాల శ్రీను ,సీనియర్ నాయకులు మన్నం ప్రసన్న రాజు ,జాకోబ్ ,రమణయ్య పాల్గొన్నారు.

4న విద్యార్థులకు అభినందనసభ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

10వ తరగతి పరీక్షల్లో 80 శాతం పైబడి మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు అభినందన, ప్రోత్సాహక బహుమతుల సభ జూన్4న నిర్వహిస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపం ప్రధాన కార్యదర్శి పొతకమూరి బాలసుబ్రమణ్యం తెలిపారు.కళ్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ అభినందన సభలో ప్రతి ఒక్క విద్యార్థికి తెలుగు-ఇంగ్లీషు డిక్షనరీ, జ్ఞాపికను పెద్దలు ఆంజనేయస్వామి పీఠాధిపతులు గోనుగుంట బ్రహ్మానంద శర్మ, మరియు గోనుగుంట మోహన్ కష్ణ అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ మండపం అధ్యక్షుడు సోడా శ్రీనివాస్, కోశాధికారి మంచా బాబూచారి, ఒంగోలు మాజీ కౌన్సిలర్ పిఎస్.బాబు, టౌన్ అధ్యక్షుడు కీనెల శ్రీనివాస్, టౌన్ ప్రధాన కార్యదర్శి మానేపల్లి గోవిందాచారి, టౌను వర్కింగ్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు, టౌన్ ఉపాధ్యక్షులు హరిబాబు, పి. నాగేంద్ర సాయి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి ఆదర్శ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ వివి. రమణయ్య తెలిపారు. పదవతరగతి పూర్తి చేసిన వారు జూన్ 7లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కళాశాలలో ఎంపిసి,బైపిసి, సిఇసి,ఎంఇసి గ్రూపులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఒసి,బిసి,ఇడబ్ల్యుఎస్ విద్యార్థులు రూ 200, ఎస్‌సి,ఎస్‌టి విద్యార్థులు రూ.150 చొప్పున ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి-కొమరోలు



పదో తరగతి పరీక్షల్లో 573 మార్కులు సాధించిన కొమరోలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని కడియాల హర్షిత జగనన్న ఆణిముత్యాలు అవార్డుకు ఎంపికైనట్లు పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు విశ్వరూపచారి తెలిపారు. జగనన్న ఆణిముత్యాలు పథకానికి ఎంపికైన హర్షితను ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు. అభినందించారు.

పెండింగ్ బిల్లులపై

'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

గ్రామాలలో మంచినీటి ఎద్దడి, చేసిన పనులకు సంబధించిన బిల్లుల పై సత్వర పరిష్కారం కోసం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సర్పంచులు వినియోగించుకోవాలని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి. వీర భద్రాచారి కోరారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా మొదలెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పంచాయతీలలో సమస్యలను ఏక వాక్య తీర్మానం చేసి ముఖ్యమంత్రి కార్యాలయానికి సర్పంచులు పోస్ట్ ద్వారా పంపించాలన్నారు. అధికారుల వేధింపులు, నిర్లక్ష్యం, నిధుల కొరత పంచాయతీలను వేధిస్తుంటే పట్టించుకున్న నాథుడే లేని స్థితిలో ముఖ్యమంత్రితోనే నేరుగా సమస్యలను ఏకరువు పెట్టుకోడానికి జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని వినియోగించు కోవాలని సూచించారు. జిల్లాలోని సర్పంచులందరూ ఈ నెల 29 న ప్రత్యేక పంచాయితీ సమావేశం ఏర్పాటు చేసుకొని ముఖ్యమంత్రికి తీర్మానం పంపాలని వీరభద్రాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రాఘవరావు, మోహన్, తిరుపాలు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండలంలోని భైరవకోనలో శ్రీ భైరవేశ్వరస్వామి దేవస్థానం సమీపంలోని వాటర్ ఫాల్స్ దగ్గర అభివద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధు రమణారెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని జంగంవారిపల్లి గ్రామానికి చెందిన చౌడ రవిచంద్రారెడ్డి రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఖర్చుతో వాటర్ ఫాల్స్ సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాత చౌడా రవిచంద్రరెడ్డిని నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు మల్లికార్జున్‌రెడ్డి, దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, వైస్ ఎంపిపి సిద్దు వెంకటరెడ్డి, దుగ్గిరెడ్డి జైరెడ్డి, బోయమడుగుల తిరుపతిరెడ్డి, భువనగిరి వెంకటయ్య, రాధాకృష్ణ, ఎం.అటేలయ్య, వాడల క్ష్మిరెడ్డి, మనోహర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

భైవరకోనలో జేసీ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-సిఎస్.పురం

సిఎస్‌పురం మండలం భైరవకోనలోని శ్రీ భైరవేశ్వరస్వామిని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులురెడ్డి ఆదివారం కుటుంబ సమేతంగా సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ కార్యనిర్వహణ అధికారి నర్రా నారాయణరెడ్డి జాయింట్ కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు. అమ్మవారు, స్వామివారి పూజల అనంతరం శేషవస్త్రాలతో సన్మానించారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరెడ్డి జయరెడ్డి, సిద్దువెంకటరెడ్డి, బసిరెడ్డి జయరామిరెడ్డి, బసిరెడ్డి తిరుమలరెడ్డి, ఎం.అటేలయ్య, బసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, అర్చకులు, ఆలయ సిబ్బందిపాల్గొన్నారు.



కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహిస్తున్న జేసీ శ్రీనివాసులు

రాయితీ పట్టలకు మంగళం

రైతులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఇటీవల అకాల వర్షాలు కురిశాయి. దీంతో ఆరబెట్టిన ధాన్యం, మిరప, మొక్కజొన్న పంటలు తడిసిపోకుండా కాపాడుకోవడానికి అన్నదాతలు నానా అగచాట్లు పడాల్సివచ్చింది. తమ వద్దనున్న పాత, చినిగిపోయిన టార్పాలిన్లు కప్పి రక్షణ కల్పించేందుకు ఎంత ప్రయత్నించినా ఉపయోగం లేకపోయింది. ధాన్యం తడిసిపోయి తీవ్రంగా నష్టపోయారు. మరికొందరు అద్దెకు పట్టలు దొరుకుతాయేమోనని పరుగులు పెట్టినా ప్రయోజనం లేకపోయింది. టార్పాలిన్లు లేక చాలా నష్టపోయామని, ధాన్యం, ఎండు మిరప కాయలు తడిసిపోయి రంగు మారిందని రైతులు విలవిల్లాడారు. ఇలా అకాల వర్షాలు కురిసిన సమయాల్లో పంట ఉత్పత్తులు తడవకుండా కాపాడుకోవడానికి రైతులకు పట్టలు(టార్పాలిన్లు) అత్యంత అవసరం. పంట దిగుబడులు చేతికొచ్చే దశలో వర్షాలు పడితే ఈ పట్టలకు విపరీతమైన డిమాండు ఉంటుంది. దీన్ని గుర్తించిన గత ప్రభుత్వం 50 శాతం రాయితీపై రైతులకు పంపిణీ చేసేది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాయితీపై అందజేసే పట్టలకు మంగళం పాడింది. దీంతో రైతులు బహిరంగ మార్కెట్లో అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేయకపోవడంతో తయారీదారులు ధరలు పెంచి విక్రయిస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కర్షకులు అధిక ధర వెచ్చించి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల వర్షాలకు ధాన్యాన్ని , కోసి ఆరబెట్టిన



పంటలను రక్షించుకోవడానికి ఒక్కొక్కరు సుమారు రూ.10 వేలకు పైగా వీటి కోసం వెచ్చించామని రైతులు చెబుతున్నారు.

అదనపు భారం..

ఖరీఫ్, రబీ సీజన్లో పంట ఉత్పత్తులను ఆరుబయట ఉంచినపుడు వర్షం, మంచు నుంచి కాపాడుకోవడానికి ప్రతి రైతుకూ పట్టలు అవసరం. తుపానులు, వాయుగుండాలు ఏర్పడినపుడు పంట చేజారిపోకుండా టార్పాలిన్లు ద్వారా కాపాడుకుంటారు. అనుకోకుండా వచ్చే వర్షాల సమయంలో పంట ఉత్పత్తులు ఆరబెట్టే ప్రాంతంలోనే పట్టలు సిద్ధంగా ఉంచుకుంటారు. ఇంత కీలకమైన పట్టలను ప్రభుత్వం రాయితీపై అందించి ఆదుకోవాల్సి ఉంది. ఇందుకు విరుద్ధంగా ప్రస్తుత ప్రభుత్వం నాలుగేళ్లగా రైతులకు పట్టలను పంపిణీ చేయకుండా వారిపై అదనపు భారం పడేలా చేస్తోంది. యర్రగొండపాలెం నియోజకవర్గంలో అధికంగా వరి, కంది, పత్తి, మిరప, మొక్కజొన్న, జొన్న తదితర పంటలు సాగు చేస్తారు. ఖరీఫ్ సీజన్ చివరి రోజుల్లో వర్షాలు బాగా కురుస్తున్నాయి. కళ్లాల్లో ధాన్యంతో పాటు ఇతర పంటలు తడిసిపోతున్నాయి. రాత్రి వేళ టార్పాలిన్లు కప్పి పగటి వేళ తొలగిస్తుంటారు. దీని వల్ల మంచు, వర్షం నుంచి పంటలను కాపాడుకొంటారు. నూర్పిడి తరువాత ధాన్యం ఆరబెట్టుకునే సమయంలో వర్షాలు వస్తే నష్టపోకుండా టార్పాలిన్లు కాపాడతాయని రైతులు తెలిపారు. మొక్కజొన్న పండించే రైతులు కూడా పట్టలపై వర్షాలు వచ్చినపుడు ఆధారపడతారు. ఇంత అవసరం ఉన్న టార్పాలిన్లను ప్రభుత్వం రాయితీపై నాలుగేళ్లుగా ఇవ్వడం లేదు. వరుస వర్షాల నేపథ్యంలో టార్పాలిన్లను రైతులు కొనుగోలు చేసుకోక తప్పలేదు. నాణ్యత, పరిమాణాన్ని బట్టి రూ. నాలుగు నుంచి పదివేల వరకూ అదనంగా ఖర్చు పెట్టక తప్పలేదని రైతులు వాపోతున్నారు. ఇక ముందైనా ప్రభుత్వం టార్పాలిన్లు రాయితీ పథకాన్ని ప్రభుత్వం పునరుద్ధరించాలని వేడుకుంటున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు స్పందించాలని కోరుతున్నారు. దీనిపై ఏడీఏ నీరజను వివరణ కోరగా రాయితీ టార్పాలిన్లు పథకం నాలుగేళ్లుగా ఆగిపోయిందన్నారు. ప్రభుత్వం పునరుద్ధరిస్తే తప్ప రైతులకు అందించలేమని ఆమె తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి-టంగుటూరు

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని గ్రంథ పాలకుడు గుమ్మడి వర్ధన రాజు తెలిపారు. టంగుటూరు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు మాట్లాడుతూ విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు వేసవి విజ్ఞాన శిబిరం దోహద దోహదపడుతుందని తెలిపారు. వేసవిజ్ఞాన శిబిరం సందర్భంగా విద్యార్థులకు అవసరమైన అనేక రకాల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు పుస్తక పఠనం అలవరుచుకునేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పురప్రముఖులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ పై అవగాహన

ప్రజాశక్తి-తర్లుపాడు

మండల పరిధిలోని తాడివారిపల్లి గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీశాఖ సిబ్బంది సెక్షన్ అధికారి సాయికుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారి జాలిరెడ్డి, నొటెక్షన్ వాచర్ డేవిడ్, రమణయ్య పాల్గొన్నారు.

వెండి సామగ్రి బహూకరణ

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలం వల్లూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ వల్లూరమ్మ అమ్మవారికి భక్తులు వెండి వస్తువులు బహూకరించారు. జరుగుమల్లి గ్రామానికి చెందిన మధులత, తమ కుటుంబ సభ్యులతో కలిసి రూ 65 వేల విలువైన వెండి కిరీటం, త్రిశూలం, తీర్థపుగిన్నె, ఉద్ధరణను బహూకరించారు. అనంతరం మధులత, కుటుంబ సభ్యులు తదితరులు వల్లూరమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం పాలకవర్గం ఛైర్మన్ కాలే శ్రీనివాసులు, కార్యనిర్వహణాధికారి బద్దెపురి రమేష్, ఆలయ అర్చకులు మధులతకు కతజ్ఞతలు తెలియజేశారు.

32మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని కట్టావారిపాలెం గ్రామంలో స్థానిక స్వచ్ఛంద సంస్థ మన ఊరి ఆరోగ్య వికాసం ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు దేవి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో 32 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ మధుమోహం మరియు రక్తపోటు వ్యాధి గ్రస్తులు ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేయించు కోవాలన్నారు. క్రమం తప్పకుండా మందులను వినియోగించాలన్నారు. మానసిక వత్తిడిని తగ్గించుకుని ఆహార నియమాలు పాటించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న మన ఊరి ఆరోగ్యవికాసం కార్యకర్తలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొక్కిసం సుబ్బారావు, మానికొండ వెంకటేశ్వర్లు, వీరమోసు మస్తానరావు, గ్రామస్తులు, దేవి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సంసిద్ధత ఉత్సవాలు

ప్రజాశక్తి-పొన్నలూరు

ఐటిసి ప్రథమ్ వారి సహకారంతో పొన్నలూరు మండలం భోగనంపాడు సెక్టార్ పరిధిలోని చెన్నిపాడు అంగన్‌వాడి కేంద్రంలో ప్రీ స్కూల్ సంసిద్ధత ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఈ ఉత్సవాలను సచివాలయం పంచాయతీ సెక్రటరీ, జిల్లా యూనియన్ అధ్యక్షురాలు సత్యవతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 3 నుంచి 6 సంవత్సరంల లోపు పిల్లలు మరియు వారి తల్లులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లల మానసిక, శారీరక, గణిత, మరియు భాష వికాసానికి సంబంధించిన అభివద్ధిలో పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమలో పథమ్ సూపర్ ట్రైనర్ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త పోలమ్మ, మహిళా పోలీస్ దీప్తి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కంభం రూరల్

కంభంకు చెందిన దొడ్డోజు రంగపుల్లయ్య ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆక్సిజన్ ద్వారా శ్వాస తీసుకుంటూ ఆర్థిక ఇబ్బందులతో సతమత మవుతున్నారు. ఈ విషయం గురించి తెలుసుకున్న విశ్వబ్రాహ్మణ సంఘం మండల కమిటీ రంగ పుల్లయ్య ఆర్థిక సాయం అందించాలని జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు రంగపుల్లయ్యకు రూ. 46, 004 ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కోశాధికారి కంచర్ల నాగ నరసింహ చారి, మండల అధ్యక్షుడు యద్దన పూడి లక్ష్మీనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి సుబ్రహ్మణ్యం, కోశాధికారి వీరబ్రహ్మం, గిద్దలూరు అధ్యక్షుడు కాయల కోటిలింగం, దేవ పూజ బ్రహ్మం, మానపల్లి కష్ణమాచార్యులు మేడూరి భాస్కరాచారి, ఏడూరి భాస్కరాచారి, కోటగిరి భాస్కరాచారి, కాయల విశ్వరూపాచారి పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

వాహన చోదకులకు కౌన్సిలింగ్

పిసిపల్లి: 18 సంవత్సరాల లోపు పిల్లలకు బైకులు, కార్లు, ఆటోలు ఇవ్వరాదని ఎస్ఐ జె.నాగేశ్వరరావు హెచ్చరించారు. వాహనాలతో రోడ్లపైకి వచ్చిన చిన్నారులు వారి తల్లిదండ్రులకు ఆదివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని ఆపి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అవగాహన లేని వారికి వాహనాలు ఇవ్వడం వల్ల వారు అతివేగంగా వాహనాలు నడపడం వల్ల ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. చిన్నారులకు వాహనాలు ఇచ్చిన వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. చిన్నారులు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే బీమా సౌకర్యం కూడా లేదన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల పరిధిలోని బోయలపల్లె గ్రామంలో నిర్మిస్తున్న గ్రామదేవత పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి ఎన్ఆర్ఐలు నల్లపాటి వంశీ, చంద్ర, ప్రమీల నల్లపాటి ఫౌండేషన్ తరపున రూ.5 లక్షల విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఆలయ అభివద్ధికి విరాళం అందించిన దాతలకు గ్రామస్తులు కతజ్ఞతలు తెలిపారు.

వైసిపి నాలుగేళ్ల పాలనలో ఏడు సార్లు పెరిగిన విద్యుత్ ఛార్జీలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నాలుగేళ్ల పాలనలో విద్యుత్ ఛార్జులు ఏడు సార్లు పెంచిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే దని టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు తెలిపారు. రాష్ట్రంలో మునుపెన్నడు లేని విధంగా కొత్త కొత్త పేర్లతో ముఖ్యమంత్రి జగన్మోహ్‌రెడ్డి ప్రజలపై కోట్లాది రూపాయల విద్యుత్ భారాలు మోపుతున్నారని విమర్శించారు. ట్రూ అప్ ఛార్జ్, టీవోడీ (టైమ్‌ఆఫ్ ది డే) పేరుతో విద్యుత్ ఛార్జీలను పెంచుతూ ప్రజలపై అదనంగా విద్యుత్ ఛార్జీలను వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కరెంటు కోతల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోతలు లేని కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ చెందిన ఉపాధ్యాయులు చిరుతోటి నరేంద్రకుమార్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఒంగోలు సివిఆర్ రీడింగ్ రూంలో నిర్వహించిన పల్నాటి వీర చరిత్ర పుస్తకం ఆవిష్కరణ సభలో నరేంద్ర కుమార్‌ను వీరనాయక అవార్డు గ్రహీతిగా ఎంపిక చేసి ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథి హైదరాబాద్ ఉర్దూ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జవి. రత్నాకర్ ఆధ్వర్యంలో సుధాకర్‌ను సన్మానించారు.



సన్మానం పొందుతున్న ఉపాధ్యాయుడు నరేంద్ర కుమార్

ప్రజాశక్తి
7
సోమవారం 22 మే 2023

దళిత ఎమ్మెల్యే నియోజకవర్గంలో

దళితులకు న్యాయం జరగదా?

ప్రజాశక్తి-భట్టిప్రోలు

దళిత నియోజకవర్గం వేమూరులో దళితులపై దాడులు, కుల దూషణలు జరిగితే న్యాయం జరిగే పరిస్థితి లేదా అని దళిత రాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జాలాది ఇస్సాకు ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన భట్టిప్రోలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. భట్టిప్రోలు మండలం కొనేటిపురంలో కర్రా తిరుపతయ్య అనే దళిత వ్యక్తి జగనన్న కాలనీలో గృహం నిర్మించుకొని నివాసం ఉంటూ మోటార్ ద్వారా ట్యాంక్‌కు నీటిని నింపుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో పక్కనే ఉన్న పంచాయతీ చెరువులో మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ పైపును తొలగించాలని తిరుపతయ్యకు చెప్పగా దానిని తొలగించాడు. మరి కాసేపటికి విషయం తెలియని తిరుపతయ్య మేనల్లుడు కరెంటు పోతుందేమోనని ఉదేశంతో పైపును తగిలించాడు. అదే సమయంలో గ్రామానికి చెందిన ఎంపిటిసి భర్త అధికార పార్టీ నాయకుడు మాల్లోలు నాగబాబు అనే వ్యక్తి మట్టి ట్రాక్టర్‌తో వచ్చి అరె నా కొడక ట్యాంక్ నిండిందిరా అని తిరుపతయ్యను ఉద్దేశించి మాట్లాడగా నా కొడక అంటావేంటి అని ఇంటికి అటువైపుగా మరోదారి



మాట్లాడుతున్న దళిత రాజ్యం నాయకులు

ఉంది అటువెళ్లండి అన్నాడు. దీంతో నాగబాబు ఏందిరా మాలనా కొడక అని తిడుతూ నువ్వు పైపు తియ్యకపోతే నీ అంతు చూస్తాను అని దుర్భాషలాడారు. కులం పేరుతో తిడతావేంటి పోలీస్ స్టేషన్లో కేసు పెడతానని వరించగా నీకు దిక్కున్న చోట చెప్పుకో అంటూ తనను బెదిరించాడని తిరుపతయ్య వాపోయాడు. ఈ నెల 15వ తేదీన జరిగిన ఈ సంఘటనపై అదేరోజు భట్టిప్రోలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చెయ్యకుండా తిరిగి తననే బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. పైగా ఎస్ఐ చంద్రశేఖర్ మీరంతా ఒకే ఊరు వాళ్ళు, ఒక చోట ఉండేవాళ్లు కేసులు ఎందుకులే సర్దుకుపొమ్మని చెపుతూ తననే వారిస్తున్నాడని ఆరోపించారు. దీంతో చేసేదేమీ లేక న్యాయం కోసం రేపల్లె డిఎస్‌పికి విన్నవించినా వేమూరు సిఐని కలవాలని సూచించారని, నేడు వేమూరు వెళ్లినా సిఐ అందుబాటులో లేరని, పోలీస్ అధికారులు కేసు నమోదు చేయకుండా ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారని బాధితుడు ఆందోళన వ్యక్తం చేశారు.

విషయం తెలుసుకున్న దళిత రాజ్యం నాయకులు బాధిత తిరుపతయ్యకు న్యాయం జరిగేవరకు అండగా ఉండి పోరాడతామని అన్నారు. కుల దూషణకు పాల్పడిన నాగబాబుపై ఎస్‌సి, ఎస్‌టి ఎట్రాసిటీ కేసు నమోదు చేసి విచారించాలని డిమాండ్ చేశారు. అధికార వైసిపికి చెందిన నాగబాబు అతని అనుచరులపై చర్యలు తీసుకొని న్యాయం జరిపించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత రాజ్యం వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మోజస్‌బాబు, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ భార్గవ్ తేజ, భట్టిప్రోలు, కొల్లూరు అధ్యక్షులు సునీల్, సందీప్ అనిల్ తదితరులు ఉన్నారు.

తిన్నింటి వాసాలు లెక్కపెట్టే పద్ధతి మానుకోవాలి

ఎమ్మెల్సీ పోతుల సునీత వాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన టిడిపి నాయకులు సజ్జా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-చీరాల



వైసీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం మానుకోవాలని తెలుగుదేశం పార్టీ నాయకులు సజ్జా వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుగుదేశం పార్టీలో సీటు కేటాయించి ఎమ్మెల్సీ స్థానం ఇచ్చి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా హెూదా కల్పిస్తేనే సునీతకు రాజకీయ ప్రస్థానం మొదలైందని, గతాన్ని ఆమె మర్చి ఇష్టానుసారంగా తమ అధినాయకుడు చంద్రబాబును విమర్శించడం తగదని హితవు పలికారు. టిడిపి నుంచి పొందిన లబ్ధిని, రాజకీయ అభివృద్ధిని మర్చిపోయి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని, పోతుల సునీతకు టిడిపి అధినేత చంద్రబాబు రెండు దఫాలు ఎంఎల్ఎ సీటు ఇచ్చి పోటీ చేసేందుకు అవకాశం ఇచ్చారన్నారు. ఆమె వర్గం చీరాల ప్రాంతంలో లేకపోయినప్పటికీ కేవలం చేనేత అన్న ఒక్క కారణంతో చీరాలలో పోటీ చేసేందుకు సీటు ఇచ్చారని తెలిపారు. ఎన్నికలకు అవసరమైన నిధులు ఇచ్చినప్పటికీ ఓడిపోయారని, అయినా ఆమెను వదలకుండా ఎంఎల్‌సి ఇచ్చిన ఘనత టిడిపిది, చంద్రబాబుది అని పేర్కొన్నారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్ష పదవి రాజకీయంగా ఎదిగేందుకు చంద్రబాబు, తెలుగుదేశం పార్టీ ఎన్నో అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు. కష్టకాలంలో తెలుగుదేశం పార్టీకి, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు అండగా ఉండకుండా చంద్రబాబు నుంచి పొందాల్సిన లబ్ధి మొత్తం పొంది గతాన్ని మరిచి చంద్రబాబు, లోకేష్‌ను విమర్శించటం విడ్డూరమని పేర్కొన్నారు. వైసిపిలో ఇప్పుడు అనుభవిస్తున్న పదవులు కూడా తెలుగుదేశం పార్టీలో ఆమెకు ఇచ్చిన ప్రాధాన్యత నుంచే వచ్చాయనేది మర్చిపోకూడదన్నారు. మరొకసారి చంద్రబాబు లోకేష్‌బాబులపై వ్యక్తిగత దూషణ చేస్తే సహించబోమని హెచ్చరించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పెద్దలు

వర్తమానం పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-అద్దంకి

పట్టణంలోని బంగాళా రోడ్‌లోని చిన్ని శాంతయ్య సేవాసదన్‌లో చెన్నుపాటి రామాంజనేయులు రచించిన వర్తమానం పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం జ్యోతి చంద్రమౌళి అధ్యక్షతన ఆదివారం జరిగింది. డాక్టర్ చేబ్రోలు నాగేశ్వరరావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. తొలి ప్రతిని ఒకప్పటి ఉపాధ్యాయ ఉద్యమ నేత స్వర్గీయ సింగరాజు రామకృష్ణయ్య కుమార్తె శాంతిప్రియకు, అల్లుడు రత్నంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విస్తాలి శంకరరావు, చెన్నుపాటి మంజుల, డివిఎం సత్యనారాయణ సమీక్ష చేస్తూ వర్తమానంలో వరిపంట సరిగా పండించకపోవడం, రైతు చితికిపోవడం అనే అంశాలను ఈ పుస్తకంలో రాసినట్లు తెలిపారు. సందిరెడ్డి శ్రీనివాసరావు, లేవిప్రసాదు, రఫీ, పసుమర్తి చినకోటయ్య, బాలు, ధర్మవరపు శ్రావణ కుమార్, చెన్నుపల్లి నాగేశ్వరరావు, అనిలకుమారసూరి, గాడేపల్లి దివాకర్ దత్తు పాల్గొన్నారు.

కోట సచ్చిదానంద శాస్త్రికి పురస్కారం

ప్రజాశక్తి-అద్దంకి

పట్టణంలోని హరిహర గోకుల క్షేత్రంలో సాహితీ మిత్రమండలి అధ్యక్షుడు లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షతన పద్మశ్రీ కోటసచ్చిదానంద శాస్త్రి పురస్కార సభ ఆదివారం జరిగింది. పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ ట్రస్టు–జీవిత సాఫల్య పురస్కారాన్ని పద్మశ్రీ కోట సచ్చిదానంద శాస్త్రికి పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, శైలజ, వారి కుటుంబ సభ్యులు చక్రధర్, తాండవ కృష్ణ, నంబూరి హనుమంతరావు, భార్గవి అందించారు. నగదు పురస్కారం రూ.21,116, పట్టువస్త్రాలు, జ్ఞాపికను పురస్కార గ్రహీత శాస్త్రికి అందజేశారు. 'పుట్టినగడ్డ సంస్కృతికి పెట్టని 'కోట'కు హరికథా 'తోట'కు 'జీవన సాఫల్య పురస్కార సత్కారం అందించి, అద్దంకి తనను తాను గౌరవించుకున్నదని, ఘనమైన వారసత్వాన్ని, సంస్కారాన్ని ఈ తరానికి పరిచయం చేయటం సంతోషంగా భావిస్తున్నామని పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల ట్రస్ట్ అధ్యక్షుడు, పురస్కార ప్రదాత పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి పేర్కొన్నారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత కోట సచ్చిదానంద శాస్త్రి మాట్లాడుతూ ఇంతటి బృహత్తర కార్యాక్రమాన్ని భుజానికి ఎత్తుకున్న సాహితీ మిత్రమండలి వారికి, పుట్టంరాజు బుల్లెయ్య,రామలక్ష్మమ్మల ఛారిటబుల్ ట్రస్టువారికి, అద్దంకిలోని సాహితీ, సాంస్కృతిక, సేవా సంస్థలకు, పెద్దలందరికీ కృతజ్ఞతలను తెలియజేశారు. సినీ సాహిత్య విశ్లేషకులు వారణాసి రఘురామశర్మ పద్మశ్రీ కోటసచ్చిదానంద శాస్త్రి జీవితవిశేషాలను సభకు పరిచయం చేశారు. ప్రముఖకవి డివిఎం సత్యనారాయణ, సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకరదత్తు కోట సచ్చిదానంద శాస్త్రి భాగవతార్ గురించి, వారి హరికథా పాండిత్యం గురించి వివరించారు. తదుపరి అద్దంకిలోని సాహితి, సాంస్కృతిక, సేవాసంస్థల ప్రతినిధులు కోట సచ్చిదానంద శాస్త్రిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భోగరాజబాలరాజు బందం పాడిన ఘంటసాల మధురగీతాలు సభను అలరించాయి. ఈ కార్యక్రమంలో కెవి పోలిరెడ్డి, చిన్నిమురళీకృష్ణ, చప్పిడి వీరయ్య, చుండూరి మురళీసుధాకర రావు, నాగసూరి వెంకట సుబ్బారావు, లక్కరాజు శ్రీనివాసరావు, భాస్కర్ సప్లయర్స్ గార్లపాటి శ్రీనివాసరావు, పువ్వాడ రామకోటేశ్వరరావు, పసుమర్తి రామారావు, పసుపులేటి ఆంజనేయులు, గోనుగుంట సుబ్బారావు, కొండ కావూరి కోటేశ్వర కుమార్, నాగసూరి సత్యనారాయణ, కంఠంరాజు శివరామ కోటేశ్వర రావు, లక్కరాజు విశ్వమోహన్, మిట్టా కామేశ్వరశర్మ, ఓరుగంటి శ్రీనివాసరావు, వామరాజు వెంకటేశ్వర్లు, కూరపాటి రామకోటేశ్వరరావు, బొంతు సత్యనారాయణ, నవయుగ స్వీట్స్ వెంగళరావు, రోటరీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, మలాది శ్రీనివాసరావు, నర్రా శ్రీలక్ష్మి, డాక్టర్ యు దేవపాలన, మహమ్మద్ రఫీ, ఊటుకూరి రామకోటేశ్వరరావు, శివకుమారి, కొల్లా భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



పద్మశ్రీ అవార్డు గ్రహీత కోట సచ్చిదానంద శాస్త్రిని సన్మానిస్తున్న దృశ్యం

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి-నిజాంపట్నం

మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 22న సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎన్ నాగలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, హరనాథబాబు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులతో మండల అభివృద్ధికి సంబంధించి శాఖ పరమైన అంశాలపై సమీక్ష జరుగుతుందని చెప్పారు. కావున మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు ఈ సమావేశానికి తప్పక హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.



మాజీ మంత్రి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుకు సన్మానం

నూతన ముఖ మండపం ఏర్పాటు

ప్రజాశక్తి-వేటపాలెం

కనక నాగవరపమ్మ దేవస్థానంలో పంచ లోహాలతో కూడిన ముఖ మండపాన్ని ఆదివారం ఏర్పాటు చేసినట్లు దేవదాయ ధర్మాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కెవిఎల్ కుమార్ తెలిపారు. స్థానిక వాస్తవ్యులు శిల్ప కళ వృత్తి రీత్యా నివాసముంటున్న మంచాల శ్రీనివాసరావు ధర్మపత్ని శివ నాగదుర్గ, కుమార్తె సాయి ప్రణతి, కుమారుడు నాగా మణికంఠ సుమారు రూ.2.50 లక్షల విలువగల పంచ లోహాలతో కూడిన ముఖ మండపం ఏర్పాటు చేశారు. వీరి కుమారునికి ఎంబీబీఎస్ సీటు వచ్చినందున వారు ముఖ మండపాన్ని బహూకరించారు. మాజీ మంత్రి, ఏపీ అధికార ప్రతినిధి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, కనక నాగవరపమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం చైర్మన్ ఏ భానుమూర్తి, బండ్లబాబు, ఈఓ జీవీఎల్ కుమార్ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఈ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాలేటి రామారావు

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తా: పాలేటి

ప్రజాశక్తి-వేటపాలెం

2024 రానున్న అసెంబ్లీ ఎన్నికలలో తనను ఆదరించే పార్టీ తరఫున కచ్చితంగా పోటీలో నిలబడతానని మాజీ మంత్రి పాలేటి రామారావు తెలిపారు. ఆదివారం వేటపాలెంలో ప్రసిద్ధి చెందిన వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గడియార స్తంభం సెంటర్లో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. తదుపరి వేటపాలెం సెంటర్ నుంచి రావూరుపేట దంతం వారి కల్యాణ మండపం వరకు 500 మంది కార్యకర్తల నడుమ తప్పెట్లతో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. అనంతరం తన అనుచరులతో కార్యకర్తలతో సమావేశమై తన మనసులోని మాటను వెల్లడించారు. ఇంతకాలం తనను ఆదరించిన ప్రజలకు, పార్టీలకు రుణపడి ఉంటానని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలలో నన్ను ఆదరించే పార్టీ తరపు నుంచి కచ్చితంగా పోటీలో పాల్గొంటారని, కాబట్టి ప్రజలు తనను ఆశీర్వదించాలని ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాలేటి రామారావు అనుచరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సంక్షేమ వారధులు వాలంటీర్లు : మంత్రి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులకు అందేలా వాలంటీర్లు వారధులుగా పని చేస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. స్థానిక అంబేద్కర్ ఆడిటోరియంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని వాలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. ఈ సంధర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించే క్రమంలో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి దేశవ్యాప్త దష్టిని ఆకర్షించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ఫలాలను పేదలకు చేర్చే అవకాశాన్ని వాలంటీర్లకు కల్పించడం గొప్ప నిర్ణయమని తెలిపారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందుతున్న సంక్షేమ సథకాలను ప్రజలకు వివరించి రాజోయే ఎన్నికల్లో జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ



మాట్లాడుతున్న మంత్రి సురేష్

సైనికుల్లా పని చేయాలని కోరారు. అనంతరం వాలంటీర్లకు వివిధ రకాల అవార్డులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసీ ఛైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సాబీర్ బాషా, పుల్లలచెరువు జడ్‌పిటిసి వాగ్యా నాయక్, సర్పంచి రామావత్ అరుణాబాయి, గంజివారిపల్లి సర్పంచి దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, నాయకులు నర్రెడ్డి వెంకటరెడ్డి, గోపు వెంకటరెడ్డి, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, డిఎల్‌డిఒ సాయికుమార్, ఎంపిడిఒ ఎం రంగ సుబ్బారాయుడు కార్యదర్శి ఈదుల రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ముస్సిపల్ కార్మికుల..

మహాసభలను జయప్రదం చేయండి

యూనియన్ గౌరవాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులో ఈనెల 24న జరగనున్న ఎపి మున్సిపల్ కార్మికులు, వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా 6వ మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో మహాసభల కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ యూనియన్ ప్రకాశం జిల్లా ఆరో మహాసభ ఈనెల 24న సిఐటియు జిల్లా కార్యాలయం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు యూనియన్ రాష్ట్ర నాయకులు, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ కేంద్రాల నుంచి మున్సిపాలిటీ యూనియన్ నాయకత్వం హాజరవుతారన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారానికి మహాసభలు జరుగుతున్నాయన్నారు. ,రానున్న రోజుల్లో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం కోసం ఈ మహాసభలు చర్చ జరిపి కార్మికులను, ఉద్యోగులను ఐక్యంగా పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్వయంగా సిఎం జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఎన్నికల మేనిఫెస్టోలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను రెగ్యులర్ చేస్తామని, లేనిపక్షంలో సమాన పనికి సమాన వేతనం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. నేటికి నాలుగు సంవత్సరాలు కాలం పూర్తవుతున్న ఇచ్చిన మాటలు ,వాగ్ధానాలు గాలిలో కలిసిపోయాయన్నారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారని, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజల ఆరోగ్యం కాపాడటం , ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా ముందుండి కరోనాపై యుద్ధం చేయడమే కాకుండా కార్మికులు ప్రాణాలు ఫణంగా పెట్టి విధులు నిర్వహించారన్నారు. కరోనాతో చనిపోయిన సభ్యులకు ఆర్థికంగా, ఉపాధిగా గాని ఆదుకోవడం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కరోనా బీమా పథకం కూడా మున్సిపల్ కార్మికులకు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. స్కిల్, సెమిస్కిల్డ్ ,జీవో నెంబర్ 7 ప్రకారం కూడా వేతనాలు అమలు కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాకర్లమూడి సామ్రాజ్యం ,సిఐటియు నగర కార్యదర్శి టి. మహేష్ ,యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు యు. రత్నకుమారి ,కొల్లాబత్తిని గోపి ,యూనియన్ వర్కింగ్ సెక్రెటరీ శ్రీరామ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి విలేకరి అంజయ్య హఠాన్మరణం

పలువురు ప్రముఖుల నివాళి

ప్రజాశక్తి-మద్దిపాడు

మద్దిపాడు మండల ప్రజాశక్తి విలేకరిగా పనిచేస్తున్న కాకుమాను అంజయ్య(62) శనివారం అర్ధరాత్రి హఠాన్మరణం చెందారు. ఈయన గత 20 సంవత్సరాలుగా ప్రజాశక్తి దినపత్రికలో విలేకరిగా కొనసాగుతున్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు తనదైన శైలిలో వార్తలను రాస్తూ వాటి పరిష్కారానికి విశేషంగా కషి చేసేవారు. అంజయ్య భార్య ఆశా వర్కర్‌గా పని చేస్తుండగా, వారి ఇద్దరు కుమారులు ఉద్యోగాలు చేస్తున్నారు. అంజయ్య సిపిఎం మద్దిపాడు గ్రామ శాఖ సభ్యునిగా ఉన్నారు. సీనియర్ జర్నలిస్టుగా ఉన్న ఆయన్ను ఇటీవల ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. అంజయ్య మతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

పెద్ద దిక్కును కోల్పోయాం : విలేకరులు



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బిఎన్. విజయ్‌కుమార్

సీనియర్ విలేకరి అంజయ్య తమకు పెద్దదిక్కుగా ఉండేవారని స్థానిక పాత్రికేయులు సంజీవరావు, రఘురామిడ్డి, సునీల్ తదితరులు తెలిపారు. ప్రతి విషయంలోనూ అంజయ్య తమకు సపోర్టుగా ఉండేవారని తెలిపారు. అంజయ్య మృతికి తమ ప్రగాఢ సానూభూతి తెలిపారు.

నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అంజయ్య పార్థివదేహాన్ని సంతనూతలపాడు మాజీ శాసన సభ్యులు బిఎన్. విజయ్ కుమార్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట మండల టిడిపి అధ్యక్షుడు జయంతి బాబు, స్థానిక నాయకులు ఉన్నారు.

సిపిఎం నివాళి..

సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జాలా అంజయ్య,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి. కొండారెడ్డి, షేక్ మాబు, కంకణాల ఆంజనేయులు, కాలం సుబ్బారావు, బంకా సుబ్బారావు, ప్రజాశక్తి ఒంగోలు ఎడిషన్ మేనేజర్ ఎంఎల్‌వి. ప్రసాద్,



అంజయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న సయ్యద్ హనీఫ్

బ్యూరో ఎస్‌వి. బ్రహ్మం, డెస్క్ ఇన్‌ఛార్జి తారక రామారావు, డివిజన్ ఇన్ ఛార్జులు ఎ. సువర్ణ రాజు, విజయ్ కుమార్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్. బాబు, సిపిఎం మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి, నాయకులు కటకం వెంకటేశ్వర్లు, జె.వేణు బాబు, ఉబ్బ వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు పావులూరి అంజయ్య తదితరులు అంజయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళుర్పించారు.

ఎడిటర్ తులసీదాస్ సంతాపం

ప్రజాశక్తివిలేకరి అంజయ్య మృతి విషయం గురించి తెలుసుకున్న ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాసు ఫోన్ ద్వారా తన సంతాపాన్ని తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ప్రతిభగల విద్యార్థులకు విదేశీ విద్య..

- జగనన్న విదేశీ విద్యకు ప్రోత్సాహం
- అందుబాటులో వివిధ కోర్సులు
- జిల్లా షెడ్యూలు కులాల సంక్షేమ సాధికారత అధికారి రాజ్‌దెబోరా

ముఖాముఖి

ప్రజాశక్తి-బాపట్ల

ప్రతిభగల విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్ది వారికి ప్రకాశవంతమైన భవిష్యత్తు కల్పించేందుకు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం విదేశీ విద్యను ప్రోత్సహిస్తున్నట్లు జిల్లా షెడ్యూలు కులాల సంక్షేమ సాధికారత అధికారి జె. రాజ్‌దెబోరా తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న విదేశీ విద్యాదీవెన, ప్రభుత్వ వసతి గహాల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న అనేక సౌకర్యాలు, సదు పాయాలపై ఆమె ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు. అవన్నీ ఆమె మాటాల్లోనే...

జిల్లాలో మూడు నుంచి పదో తరగతి వరకు ప్రీ మెట్రిక్ బాలుర వసతి గహాలు10, బాలికల వసతి గహాలు ఏడు ఉన్నాయి .పోస్ట్ మెట్రిక్ ఇంటర్ ఆపై చదువుకు బాలురకు ఆరు, బాలికల వసతి గహాలు 6 కలిపి మొత్తం 12 ఉన్నాయి. జిల్లాలో 2,900 మంది విద్యార్థులకు ఆయా వసతి గహాల్లో అడ్మిషన్ల ద్వారా వసతి కల్పిస్తున్నారు. ఇప్పటివరకు ప్రీమెట్రిక్ 1,700 అడ్మిషన్లకుగానూ 1,094 అడ్మిషన్లు జరిగాయి. ప్రీ మెట్రిక్ బాలికలు 12 వందల మందికి 613 అడ్మిషన్లు పూర్తయ్యాయి. మొత్తం 1,707 అడ్మిషన్లు పూర్తయ్యాయి. మూడు నుంచి 10వ తరగతి వరకు ప్రీ మెట్రిక్‌లో ఎస్‌సిలకు 70 శాతం, బీసీలకు 9, ఓసీలకు 4, ఎస్సీలకు 5, క్రిస్టియన్‌మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారు. ప్రీ మెట్రిక్ విద్యార్థులకు 14 ప్రభుత్వ భవనాల్లో వసతి గహాలు కొనసాగుతున్నాయి. అందులో మూడు



ప్రైవేటు భవనాలలో నిర్వహిస్తున్నారు. పోస్ట్ మెట్రిక్ ఐదు ప్రభుత్వ భవనాలు, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు ఏడు ప్రైవేటు భవనాల్లో వసతి కల్పించారు. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన స్కాలర్ షిప్ లు విద్యార్థి తల్లి ఖాతాలో జమచేస్తున్నారు. డిగ్రీ ఆపై చదువులు చదివే విద్యార్థులకు వసతి దీవెన రూ.20వేలు, పాలిటెక్నిక్, ఐటిఐ విద్యార్థులకు రూ.10వేల చొప్పున అందజేస్తున్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం..

విదేశీ విద్య దీవెనకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఉత్తమ ఫలితాలు సాధించి విదేశీ విద్యపై ఆసక్తి కనపరిచే విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక వనరులు సమకూరుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా అర్హత కలిగిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, ఇబిసి (కాపుతో కలిపి) పిజి, పిహెచ్.డి,ఎంబిబిఎస్ కోర్సులతోపాటు మరో 21 కేటగిరిల సబ్జెక్టులలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు 50 ఉత్తమ విశ్వవిద్యాలయాలు , కళాశాలల్లో ప్రపంచ దేశాల్లోని నూతన జాబితా క్యూఎస్ , టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రపంచ ర్యాంకింగ్ 2023 ప్రకారం సుమారు 379 విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో చదువుచున్న విద్యార్థులు ఈ పథకానికి అర్హులు.

అందులో బాటులో కోర్సులు

ఎకౌంట్ సెండ్ ఫైనాన్స్, ఎడ్యుకేషన్ మరియు ట్రైనింగ్, అగ్రికల్చర్ ఫారెస్ట్రే, ఎలక్ట్రికల్స్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ బెల్ట్ ఎన్విరాన్‌మెంట్, ఇంజినీరింగ్ మినరల్స్ మైనింగ్, ఆర్ట్‌అండ్ డిజైన్, ఫైవ్ స్టార్ అండ్ హ్యూమానిటీస్, ఇంజినీరింగ్ పెట్రోలియం, బయాలజికల్ సైన్స్, హాస్పిటాలిటీ లీజర్ మేనేజ్ మెంట్, బిజినెస్,లా,కెమిస్ట్రి, మెడిసిన్ నేచురల్ సైన్స్, కమ్యూనికేషన్ అండ్ మీడియా స్ట్రాటజీ, కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్ అండ్ అటానమి, ఎకనామిక్స్ అండ్ ఎకోనోమెట్రిక్స్ కోర్సులను విదేశాల్లో విద్య అభ్యసించే అర్హులైన విద్యార్థులు జగనన్న విదేశీ విద్య పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. అర్హత పరీక్షలో 60 శాతం మార్కులు కలిగి ఉండాలి. ఎంబిబిఎస్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు నీట్ పరీక్ష లో తప్పనిసరిగా అర్హత సాధించి ఉండాలి.

ఫీజు చెల్లింపు ఇలా....

ఈ పథకానికి అర్హత సాధించి ఎంపికైన ఎస్‌సి,ఎస్‌టి, బిసి మైనారిటీ విద్యార్థులకు నూరు శాతం ట్యూషన్ ఫీజు లేదా రూ.1.25 కోట్లు ఏదీ తక్కువైతే అది ప్రభుత్వం సమకూరుస్తోంది. ఇతర కులాల విద్యార్థులకు నూటికి నూరు శాతం ట్యూషన్ ఫీజు (లేదా) రూ.కోటి ఏది తక్కువైతే అది ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ పథకానికి అర్హత కలిగిన విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షల లోపు ఉండాలి. విద్యార్థి వయస్సు నోటిఫికేషన్ నాటికి 35 ఏళ్ల లోపు ఉండాలి. ఆదాయ ధ్రువీకరణ పత్రం నిర్దేశిత ప్రొఫార్మాలో మాత్రమే నింపాలి.